


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 112 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కావలి, నెల్లూరుజిల్లా బుధవారం 4 మార్చి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 112 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAVALI, NELLORE DIST, WED 4 MARCH 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : ,SPSR Nellore, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa, Hyderabad, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur

# ముగిసిన చంద్రబాబు, పవన్ కల్యాణ్ భేటీ..

## సుదీర్ఘంగా చర్చలు జరిపిన నేతలు

- ఉండవల్లిలోని చంద్రబాబు నివాసానికి వెళ్లిన పవన్ కల్యాణ్
- గ్రామీణాభివృద్ధి, టీటీడీ వివాదాలపై ప్రధానంగా చర్చ
- జల్ జీవన్ మిషన్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని నిర్ణయం



**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మధ్య ఉండవల్లిలోని సీఎం నివాసంలో సుమారు రెండు గంటల పాటు కీలక భేటీ జరిగింది. మంగళగిరిలో 'ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం' సందర్భంగా జరిగిన అటవీ శాఖ 'హనుమాన్' ప్రాజెక్టు ప్రారంభోత్సవం ముగించుకుని పవన్ నేరుగా సీఎం వద్దకు వెళ్లారు. ఈ సమావేశంలో ప్రధానంగా గ్రామీణాభివృద్ధి, టీటీడీ వివాదాలపై చర్చ జరిగింది. రాష్ట్రంలో 'జల్ జీవన్ మిషన్' అమలుపై ముఖ్యమంత్రితో పవన్ చర్చించారు. ప్రతి గ్రామీణ కుటుంబానికి రోజుకు తలసరి 55 లీటర్ల స్వచ్ఛమైన మంచినీటిని అందించాలని వీరు నిర్ణయించారు. గత ప్రభుత్వం ఈ పథకాన్ని నిర్లక్ష్యం చేసిందని, కేంద్రం నుంచి వచ్చిన నిధులను దారి మళ్ళించిందని ఇరువురు నేతలు అభిప్రాయపడ్డారు. కేంద్రం ఈ మిషన్ గడువును 2028 వరకు పొడిగించిన నేపథ్యంలో, పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసేలా కార్యాచరణ సిద్ధం చేశారు. కేవలం నీటి సరఫరానే కాకుండా గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ, రోడ్ల నిర్మాణం, నిర్వహణపై కూడా దృష్టి సారించాలని నిర్ణయించారు. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడుపై మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి చేస్తున్న ఆరోపణలు, వైరల్ అవుతున్న వీడియోల అంశం కూడా ఈ భేటీలో ప్రధానంగా చర్చకు వచ్చినట్లు సమాచారం. టీటీడీ పవిత్రతను కాపాడటంతో పాటు, వస్తున్న ఆరోపణల వెనుక ఉన్న రాజకీయ కోణాలను వీరు విశ్లేషించినట్లు తెలుస్తోంది. అలాగే టీటీడీ ప్రసాదాల్లో నాణ్యత, భక్తుల సౌకర్యాలపై కూడా సమీక్షించారు. త్వరలో భర్తీ చేయాల్సిన నామినేటెడ్ పదవులు, స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహాలు, రాజ్యసభ అభ్యర్థుల ఎంపికపై కూడా ఇరువురు నేతలు ఒక ప్రాథమిక అవగాహనకు వచ్చినట్లు తెలుస్తోంది.



## నేను, సిద్ధరామయ్య పాలు, తేనె లాంటి వాళ్లం

- సీఎం మార్పుపై ఇప్పటివరకూ చర్చించలేదని స్పష్టీకరణ
- పార్టీలో విభేదాలు సృష్టించేందుకు ప్రతిపక్షాల కుట్ర అంటూ ఆరోపణ
- కాంగ్రెస్‌లో అసమ్మతి లేదు.. అంతా ఐక్యంగా ఉన్నామని వెల్లడి

**పెన్ పవర్ డెస్క్:**కర్ణాటక రాజకీయాల్లో ముఖ్యమంత్రి మార్పు, నాయకత్వలేమిపై వస్తున్న వార్తలకు డిప్యూటీ సీఎం డి.కె. శివకుమార్ (డీకే) తనదైన శైలిలో సమాధానం ఇచ్చారు.

- మిగతా 2లో



## జగన్‌ను కలిసిన తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క

- జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఉప ముఖ్యమంత్రి
- ఈ నెల 5న తన కుమారుడి వివాహానికి రావాలంటూ ఆహ్వానం
- శుభాకాంక్షలు తెలిపిన జగన్

**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్‌ను తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు

- మిగతా 2లో



## రూ.100 కోట్ల ఆలయ భూమి కబ్జా అయింది

- అనకాపల్లిలోని కన్యాకాపరమేశ్వరి ఆలయ భూమి కబ్జా అయిందన్న గుడివాడ
- భూ కబ్జాపై సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్
- చంద్రబాబు ఆధ్వర్యంలో ఒక దొంగల ముఠా ఏర్పడిందని ఆరోపణ

- మిగతా 2లో

### జోగి రమేశ్ ను పరామర్శించిన బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి..

## కూటమి ప్రభుత్వంపై విమర్శలు

- జోగి రమేశ్ ఇంటిపై దాడులు జరుగుతుంటే పోలీసులు సైలెంట్ గా ఉన్నారన్న బుగ్గన
- నేరస్తులకు రక్షణ కల్పిస్తున్నారా అని ప్రశ్న
- అంబటిపై తప్పుడు కేసులు పెట్టారని మండిపాటు
- అధికారం ఎవరికీ శాశ్వతం కాదని వ్యాఖ్య
- చంద్రబాబు తన అనుభవాన్ని రాష్ట్రం కోసం ఉపయోగించాలని సూచన




రాష్ట్రంలో రాజకీయ కక్ష సాధింపులు పరాకాష్ఠకు చేరాయని వైసీపీ నేత, మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ధ్వజమెత్తారు. మాజీ మంత్రి జోగి రమేశ్ నివాసానికి వెళ్లిన బుగ్గన ఆయనను పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ...

- మిగతా 2లో

## ఇరాన్ తాజాగా చర్చలకు ప్రయత్నించింది...

### ఇప్పటికే చాలా ఆలస్యమైందని చెప్పాను




- ట్రూత్ సోషల్ లో ట్రంప్ పోస్ట్
- ఇరాన్ వాయుసేన, నావికాదళం, రక్షణ వ్యవస్థలు ధ్వంసమైనట్లు వెల్లడి
- ఆ దేశ నాయకత్వం కూడా తుడిచిపెట్టుకుపోయిందన్న అమెరికా అధ్యక్షుడు

మిగతా 2లో

### సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపిన


## డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

- ఉండవల్లిలో చంద్రబాబుతో పవన్ కల్యాణ్ భేటీ
- చంద్రబాబుతో సమావేశం అనంతరం పవన్ ప్రకటన
- గ్రామాల అభివృద్ధికి నిధులు ఇస్తున్న సీఎంకు ధన్యవాదాలు తెలిపిన వైనం
- ఆర్థిక కష్టాల్లోనూ పంచాయతీలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని వెల్లడి

**పెన్ పవర్ డెస్క్:**రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉన్నప్పటికీ గ్రామాల అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయిస్తూ, పంచాయతీ వ్యవస్థ బలోపేతానికి సంపూర్ణ సహకారం అందిస్తున్నా రంటూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రత్యేక కృత జ్ఞతలు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యత మరువలేనిదని

మిగతా 2లో





## మంగళగిరి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి

### బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న మంత్రి లోకేశ్ దంపతులు

- స్వామివారికి ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పించిన లోకేశ్
- శ్రీవారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించి ప్రత్యేక ఆశీస్సులు పొందిన మంత్రి దంపతులు
- ఘనంగా స్వాగతం పలికిన ఆలయ అధికారులు, స్థానిక నాయకులు

మిగతా 2లో

## పశ్చిమాసియా రణరంగం


### అమెరికా ఎంబసీలను టార్గెట్ చేసిన ఇరాన్

- సౌదీలోని అమెరికా దౌత్య కార్యాలయంపై ఇరాన్ డ్రోన్ల దాడి
- బహ్రెయిన్, ఒమన్‌లలోని అమెరికా స్థావరాలపైనా విరుచుకుపడ్డ ఇరాన్
- టెహ్రాన్, బీరుట్ లలో కొనసాగుతున్న ఇజ్రాయెల్ విధ్వంసకాండ
- అంతర్జాతీయంగా ఆకాశాన్నంటుతున్న గ్యాస్ ధరలు



**పెన్ పవర్ డెస్క్:**మధ్యప్రాచ్యంలో యుద్ధ మేఘాలు మరింత దట్టంగా కమ్ముకున్నాయి. ఇజ్రాయెల్, అమెరికా కూటమి దాడులతో ఇరాన్ సర్వోన్నత నాయకుడు అయతొల్లా అలీ ఖమేనీ మరణించడంతో పరిస్థితి అదుపుతప్పింది. ఖమేనీ మరణానికి ప్రతీకారంగా ఇరాన్ తీవ్రస్థాయిలో దాడులు చేస్తోంది. ముఖ్యంగా అమెరికా దౌత్య కార్యాలయాలు, సైనిక స్థావరాలనే లక్ష్యంగా చేసుకుని ఇరాన్

మిగతా 2లో



## భారతీయ క్రియేటర్ల శ్రమను దోచుకుంటున్నారు


- ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి సంస్థలు మన క్రియేటర్లను దోచుకుంటున్నాయన్న విజయసాయి
- ఇన్‌స్టాగ్రామ్ ఒక్క రూపాయి కూడా ఇవ్వడం లేదని మండిపాటు
- మనకు ఒక స్వదేశీ సోషల్ మీడియా యాప్ ఉండాలని వ్యాఖ్య

మిగతా 2లో

## ఒమన్ సుల్తాన్, కువైట్ యువరాజుతో ఫోన్‌లో మాట్లాడిన ప్రధాని మోదీ

- భారతీయుల భద్రతపై వారితో చర్చించినట్లు ప్రధాని కార్యాలయం వెల్లడి
- గల్ఫ్ దేశాల మీద జరుగుతున్న దాడులపై ప్రధాని ఆందోళన
- చర్చలు, దౌత్య మార్గాల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలన్న విదేశాంగ శాఖ

మిగతా 2లో






## ఇరాన్... ఓ వైపు యుద్ధం, మరోవైపు భూకంపం

- దక్షిణ ఇరాన్‌లోని గెరాష్ ప్రాంతంలో భూకంపం
- రిక్టర్ స్కేలుపై 4.3 తీవ్రతతో కంపించిన భూమి
- గెరాష్‌కు 55 కిలోమీటర్ల దూరంలో 10 కిలోమీటర్ల లోతున భూకంప కేంద్రం

మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# మధ్యప్రాచ్యంలో మళ్లీ మంటలు: ట్రంప్ సుదీర్ఘ దాడుల వ్యూహం ఏమిటి?

మధ్యప్రాచ్యంలో మళ్లీ మంటలు రేగాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' తర్వాత పరిస్థితులు వేగంగా మారాయి. రియాద్‌లోని అమెరికా రాయబార కార్యాలయంపై ఇరాన్ డ్రోన్ల దాడి జరిగినట్టు వచ్చిన సమాచారం నేపథ్యంలో ట్రంప్ చేసిన హెచ్చరికలు యుద్ధం త్వరలో ముగిసే సూచనలు కనిపించడం లేదనే సంకేతాలు ఇస్తున్నాయి. "మా ప్రతిస్పందన ఏమిటో త్వరలో తెలుస్తుంది" అన్న ఆయన వ్యాఖ్యలు సుదీర్ఘ సైనిక వ్యూహానికి నాంది పలికినట్టుగా విశ్లేషకులు భావిస్తున్నారు.

ఈ పరిణామాలకు ఆయువులా నిలిచింది ఇరాన్ అణు కార్యక్రమమే. ఇరాన్ అణ్వాయుధ సామర్థ్యాన్ని పూర్తిగా అంగీకరించబోమని అమెరికా స్పష్టం చేస్తుండగా దీర్ఘ పరిధి క్షిపణులు అమెరికా స్థావరాలు.. మిత్రదేశాలకు ముప్పుగా మారుతున్నాయనే ఆందోళన వాషింగ్టన్‌లో పెరుగుతోంది. ఇరాన్ సైనిక వ్యవస్థను బలహీనపరచడం.. ముఖ్యంగా దాని మిసైల్ సామర్థ్యాన్ని నిర్వీర్యం చేయడమే ఈ ఆపరేషన్ ప్రధాన లక్ష్యమని అమెరికా వర్గాలు చెబుతున్నాయి. ఇక ఇరాన్ వైపు చూస్తే సుప్రీం లీడర్ ఖమేనీ మరణించినట్టు వచ్చిన వార్తలు దేశంలో రాజకీయ అనిశ్చితిని మరింత పెంచాయి. నాయకత్వ శూన్యత మధ్య ఇరాన్ సైన్యం, ముఖ్యంగా ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్.జీసీ) ప్రతిదాడులతో తన స్థైర్యాన్ని చాటుకునే ప్రయత్నం చేస్తోంది. యూఏఈ, ఖతార్ ప్రాంతాల్లోని అమెరికా స్థావరాలపై జరిగిన దాడుల్లో అమెరికన్ సైనికులు ప్రాణాలు కోల్పోయినట్టు సమాచారం రావడంతో అమెరికా మరింత కఠిన వైఖరిని అవలంబించే అవకాశం ఉంది. ఈ యుద్ధం కేవలం రెండు దేశాల మధ్య పరిమితం కాదు. గల్ఫ్ దేశాలు తీవ్ర ఆందోళనలో ఉన్నాయి. చమురు ఉత్పత్తి, సరఫరా మార్గాలు, హోర్ముజ్ జలసంధి భద్రత వంటి అంశాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రత్యక్ష ప్రభావం చూపుతాయి. చమురు ధరలు పెరగడం వల్ల గ్లోబల్ ఇన్ఫ్లేషన్ మళ్లీ ఎగసిపడే ప్రమాదం ఉంది. ఇప్పటికే మార్కెట్లు అస్థిరంగా మారుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. అంతర్జాతీయ రాజకీయ రంగంలోనూ ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. యురోపియన్ యూనియన్ శాంతి చర్చలకు మద్దతు తెలుపుతూ అణు విస్తరణపై ఆందోళన వ్యక్తం చేసింది. మరోవైపు రష్యా, చైనా వెంటనే దాడులు ఆపాలని పిలుపునిచ్చాయి. ఒమాన్ మధ్యవర్తిత్వంతో జెనీవాలో జరగబోయే చర్చలు కీలక మలుపు తిప్పే అవకాశమున్నప్పటికీ యుద్ధభూమిలో జరుగుతున్న పరిణామాలు దౌత్యపరమైన ప్రయత్నాలను బలహీనపరుస్తున్నాయి.

ట్రంప్ మరో నాలుగు నుంచి ఐదు వారాలు దాడులు కొనసాగవచ్చని చేసిన ప్రకటన యుద్ధ వ్యూహం ముందుగానే సిద్ధంగా ఉన్నట్టు సూచిస్తోంది. ఇది కేవలం ప్రతీకార దాడి కాద.. ఇరాన్ సైనిక సామర్థ్యాన్ని వ్యవస్థాత్మకంగా కుదించే లక్ష్యంతో రూపొందించిన సుదీర్ఘ ఆపరేషన్ అని విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే దీర్ఘకాల యుద్ధం అమెరికా లోపల కూడా రాజకీయ ప్రభావాలను చూపవచ్చు. సైనిక నష్టం, ఆర్థిక భారం, అంతర్జాతీయ ఒత్తిళ్లు.. ఇవి కలిసి వాషింగ్టన్ నిర్ణయాలను ప్రభావితం చేసే అవకాశముంది. మొత్తానికి ఈ సంక్షోభం మధ్యప్రాచ్య భద్రతా సమీకరణాలను పూర్తిగా మార్చే దిశగా సాగుతోంది. అణు కార్యక్రమం, ప్రాంతీయ ఆధిపత్యం, మిత్రదేశాల భద్రత.. ఇవన్నీ ఈ మూడు అంశాల చుట్టూ తిరుగుతున్న ఈ యుద్ధం త్వరగా ముగిసే సూచనలు లేవు. దౌత్య మార్గాలు తెరిచి ఉన్నప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల్లో సైనిక చర్యలే ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. వచ్చే కొన్ని వారాలు గ్లోబల్ రాజకీయాలకు, ఆర్థిక వ్యవస్థలకు కీలక పరీక్ష కాలంగా మారనున్నాయి.

## ఇరాన్... ఓ వైపు యుద్ధం, మరోవైపు భూకంపం

ఒకవైపు అమెరికా, ఇజ్రాయెల్ వైమానిక దాడులు కొనసాగుతుం డగా, మరోవైపు ఇరాన్‌లో భూకంపం సంభవించింది. దక్షిణ ఇరాన్‌లోని గెరాష్ ప్రాంతంలో రిక్టర్ స్కేలుపై 4.3 తీవ్రతతో భూమి కంపించింది. ఈ భూకంపం వల్ల ఆస్తి, ప్రాణ నష్టం గురించి వివరాలు తెలియాల్సి ఉంది. గెరాష్‌కు ఉత్తర వాయువ్య దిశలో 55 కిలోమీటర్ల దూరంలో 10 కిలోమీటర్ల లోతున భూకంప కేంద్రాన్ని గుర్తించారు. రిక్టర్ స్కేలుపై 4.3 తీవ్రత నమోదు కావడంతో ఈ భూకంపాన్ని తేలికపాటి నుంచి మధ్యస్థాయి భూకంపంగా తెలిపారు. భూకంపం వచ్చిన ప్రాంతం ఎక్కువగా గ్రామీణ ప్రాంతం. ఒక్కసారిగా భూమి కంపించడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు పరుగు పెట్టారు. ఎలాంటి సునామీ హెచ్చరికలు జారీ కాలేదు.

# పశ్చిమాసియా రణరంగం

- మొదటి పేజి తరువాయి

విరుచుకుపడుతోంది. యుద్ధం నాలుగో రోజుకు చేరుకోగా.. ఇరాన్ తన వ్యూహాన్ని మార్చింది. సౌదీ అరేబియా రాజధాని రియాద్ లో ఉన్న అమెరికన్ ఎంబసీపై రెండు డ్రోన్లతో దాడి చేసింది. ఈ ఘటనలో ఎంబసీ ఆవరణలో మంటలు చెలరేగగా, భవనానికి స్వల్ప నష్టం వాటిల్లింది. దౌత్య కార్యాలయాలపైనే నేరుగా దాడులు జరగడం యుద్ధ తీవ్రతను తెలియజేస్తోంది. మరోవైపు ఒమన్‌లోని దుక్మ్ పోర్ట్‌పై కూడా డ్రోన్ దాడి జరగడంతో ఇంధన ట్యాంక్ దెబ్బతింది. అలాగే బహ్రెయిన్‌లోని అమెరికన్ ఎయిర్ బేస్‌లో ఉన్న ఓ కమాండ్ భవనాన్ని పూర్తిగా ధ్వంసం చేశామని ఇరాన్ మీడియా ప్రకటించింది. హోర్ముజ్ జలసంధిలో నౌకలను మంటల్లో కలిపేస్తామంటూ ఇరాన్ అధికారులు హెచ్చరించారు. మరోవైపు ఇజ్రాయెల్ తన దాడులను ఏమాత్రం తగ్గించడం లేదు. ఇజ్రాయెల్ వైమానిక దళం మంగళవారం కూడా టెహ్రాన్‌లోని సైనిక లక్ష్యాలపై విరుచుకుపడింది. టెహ్రాన్ తూర్పున ఉన్న పార్డిస్ ప్రాంతంలో భారీ పేలుళ్లు సంభవించగా, నగరం మొత్తం పొగతో నిండిపోయింది. ఇజ్రాయెల్ అటు లెబనాన్ రాజధాని బీరుట్ దక్షిణ శివార్లలోనూ భవనాలను నేలమట్టం చేస్తోంది. దీనికి దీటుగా హిజ్బుల్లా కూడా గోలాన్ హైట్స్, మెరాన్, రమత్ డేవిడ్ వైమానిక స్థావరాలపై క్షిపణి దాడులు చేసింది. ఈ యుద్ధం కారణంగా సామాన్యులు బలవుతున్నారు. ఇరాన్‌లో ఇప్పటివరకు 787 మంది మరణించగా, అందులో 176 మంది చిన్నారులు ఉన్నట్లు సమాచారం. అటు అమెరికా వైపు ఆరుగురు సైనికులు మరణించారు.

అమెరికా సైనికుల మరణాన్ని యూఎస్ సెంట్రల్ కమాండ్ కూడా ధృవీకరించింది. ఖతార్, సౌదీలో చమురు ఉత్పత్తికి అంతరాయం కలగడంతో అంతర్జాతీయ మార్కెట్లో గ్యాస్ ధరలు భగ్గుమంటున్నాయి. సోమవారం 50 శాతం పెరిగిన ధరలు, మంగళవారం మరో 33 శాతం పెరిగి సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నాయి. ఇరాన్‌పై దాడులు మరింత తీవ్రతరం చేస్తామని అమెరికా మంత్రి మార్కో రుబియో హెచ్చరించగా, టెహ్రాన్‌పై పూర్తి శక్తితో విరుచుకుపడతామని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి స్పష్టం చేశారు.

# రూ.100 కోట్ల ఆలయ భూమి కబ్జా అయింది

సనాతన ధర్మం పేరుతో రాజకీయాలు చేసే నేతలు, కోట్లాది రూపాయల విలువైన ఆలయ భూములు కబ్జా అవుతుంటే ఎందుకు మౌనంగా ఉన్నారని వైసీపీ నేత గుడివాడ అమర్నాథ్ ప్రశ్నించారు. అనకాపల్లి పట్టణ నడిబొడ్డున ఉన్న కన్యకాపరమేశ్వరి దేవాలయానికి చెందిన భూములు అక్రమంగా బదలాయించారంటూ ఆయన మండిపడ్డారు. వందేళ్ల క్రితం దాతలు కన్యకాపరమేశ్వరి ఆలయానికి 2 ఎకరాల 49 సెంట్ల భూమిని దానంగా ఇచ్చారని... అందులో ఎన్టీఆర్ మార్కెట్ యార్డ్ కోసం కొంత తీసుకోగా, మిగిలిన 1 ఎకరా 11 సెంట్ల స్థలం ప్రస్తుతం ఉందని అమర్నాథ్ తెలిపారు. దీని విలువ మార్కెట్ ధర ప్రకారం రూ.100 కోట్లకు పైగానే ఉంటుందని ఆయన వెల్లడించారు. దేవాదాయ శాఖకు చెందిన ఈ విలువైన భూమిని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించే అధికారం అధికారులకు ఎక్కడిదని ఆయన నిలదీశారు. ప్రభుత్వ రికార్డుల్లో ఉన్న భూమిని ప్రైవేట్ స్థలంగా చూపుతూ అధికారులు ఏ ప్రాతిపదికన నివేదిక ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఒక 'దొంగల ముఠా' ఏర్పడిందని, కూటమి నేతల అండతో ప్రభుత్వ, దేవాదాయ భూములను ఈ ముఠా దోచుకుంటోందని ఆరోపించారు. రూ.100 కోట్ల విలువైన ఈ భూమి ఇప్పటికే కౌలుదారుల పేరు మీదకు మారిందని, ఈ భారీ కుంభకోణంపై తక్షణమే సీబీఐ విచారణ జరిపించాలని అమర్నాథ్ డిమాండ్ చేశారు.

## జోగి రమేశ్ ను పరామర్శించిన బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి..
# కూటమి ప్రభుత్వంపై విమర్శలు

జోగి రమేశ్ ఇంటిపై పెట్రోల్ బాంబులు, యాసిడ్ బాంబులతో దాడులు జరుగుతుంటే పోలీసులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడమే కాకుండా, దాడులు చేసే వారికి ఎస్కార్ట్ ఇవ్వడం దుర్మార్గమని విమర్శించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు ఉన్నాయా లేక నేరస్థులకు రక్షణ కల్పిస్తున్నారా? అని ఆయన ప్రశ్నించారు. రాజకీయ దాడులను మహిళలు ముందుండి నడిపించడం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఎన్నడూ చూడని కొత్త సంస్కృతి అని ఆయన అన్నారు. మహిళలతో అసభ్యకరంగా మాట్లాడించడం, దాడులు చేయించడం వెనుక పెద్దల 'కోచింగ్' ఉందని ఆరోపించారు.

మాజీ మంత్రి అంబటి రాంబాబు తన వ్యాఖ్యలపై పశ్చాత్తాపం వ్యక్తం చేసినప్పటికీ, ఆయనపై తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపడాన్ని బుగ్గన తప్పుబట్టారు. బాధితులపైనే కేసులు పెట్టడం విడ్డూరంగా ఉందని, అధికారం ఎవరికీ శాశ్వతం కాదనే విషయాన్ని కూటమి నేతలు గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. దశాబ్దాల రాజకీయ అనుభవం ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు తన అనుభవాన్ని రాష్ట్రం కోసం ఉపయోగించాలి కానీ, ప్రతిపక్ష నేతలపై తప్పుడు కేసులు పెట్టడానికి కాదని అన్నారు.

# ఇరాన్ తాజాగా చర్చలకు ప్రయత్నించింది...

యుద్ధం మధ్యప్రాచ్యంలో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ తాజాగా తమతో చర్చలు జరిపేందుకు సిద్ధమైందని, కానీ అందుకు సమయం మించిపోయిందని ట్రంప్ స్పష్టం చేశారు. ఇజ్రాయెల్–ఇరాన్ మధ్య భీకర దాడులు కొనసాగుతున్న నేపథ్యంలో ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ట్రంప్ తన సొంత సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్' వేదికగా ఈ విషయంపై స్పందించారు. "ఇరాన్ ఎయిర్ డిఫెన్స్ (వాయు రక్షణ వ్యవస్థ), ఎయిర్ ఫోర్స్ (వాయుసేన), నేవీ (నావికాదళం) తుడిచిపెట్టుకుపోయాయి. ఇరాన్ నాయకత్వాన్ని తుదముట్టించాం. ఇప్పుడు వారు మాతో మాట్లాడాలని కోరుకుంటున్నారు. తాజాగా ఇరాన్ చర్చలు జరిపేందుకు ప్రయత్నించింది. దానికి నేను 'టూ లేట్' (ఇప్పటికే చాలా ఆలస్యమైంది) అని సమాధానమిచ్చాను" అని ట్రంప్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. వాషింగ్టన్ పోస్ట్‌లో 'ట్రంప్ డాక్ట్రిన్' పేరుతో వచ్చిన ఒక విశ్లేషణాత్మక కథనానికి స్పందనగా ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఇజ్రాయెల్–ఇరాన్ యుద్ధం తీవ్ర

స్థాయికి చేరుకోగా, అమెరికా సైనిక చర్యలు కొనసాగుతున్నాయి. ఇరాన్ సైనిక శక్తి, నాయకత్వం తీవ్రంగా నష్టపోయాయని, యుద్ధం మరికొన్ని వారాల పాటు కొనసాగే అవకాశం ఉందని ట్రంప్ అంచనా వేశారు. అమెరికా సైనిక శక్తి తిరుగులేనిదని ఆయన పునరుద్ఘాటించారు.

# ఒమన్ సుల్తాన్, కువైట్ యువరాజుతో ఫోన్‌లో మాట్లాడిన ప్రధాని మోదీ

ఇరాన్, ఇజ్రాయెల్–అమెరికా యుద్ధం నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఒమన్ సుల్తాన్, కువైట్ యువరాజుతో ఫోన్‌లో సంభాషించారు. గల్ఫ్‌లో కొనసాగుతున్నసంఘర్షణ, ఈ ప్రాంతాల్లోని భారతీయుల భద్రతపై వారితో చర్చించినట్లు ప్రధానమంత్రి కార్యాలయం వెల్లడించింది. కువైట్ యువరాజు సబా అల్ ఖలీద్ అల్ సబాతో ప్రధాని మోదీ ఫోన్‌లో మాట్లాడారు. గల్ఫ్ దేశాలపై జరుగుతున్న దాడుల మీద ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఒమన్ సుల్తాన్‌తోనూ ప్రధాని మోదీ మాట్లాడారని ప్రధానమంత్రి కార్యాలయం తెలిపింది. చర్చలు, దౌత్య మార్గాల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని భారత్ పిలుపునిస్తోందని

విదేశాంగ మంత్రిత్వ శాఖ పునరుద్ఘాటించింది. ఇరుపక్షాలు సంయమనం పాటించాలని, ఉద్రిక్తతలను నివారించాలని కోరింది. పౌరుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించింది.

## సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

- మొదటి పేజి తరువాయి

ఆయన పేర్కొన్నారు. మంగళవారం నాడు ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో చంద్రబాబుతో పవన్ కల్యాణ్ భేటీ అయ్యారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో జరిగిన ఈ భేటీలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్ డబ్ల్యూఎస్, అటవీ శాఖలకు సంబంధించిన కీలక అంశాలపై ఇరువురూ చర్చించారు. ప్రధానంగా జల్ జీవన్ మిషన్ పనుల పురోగతి, నిధుల వినియోగం, గ్రామీణ రోడ్ల నిర్మాణం వేగవంతం చేయడం వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చ సాగింది. నియోజకవర్గాల వారీగా జరిగిన నిధుల కేటాయింపులపై కూడా సమీక్షించారు. ఈ సందర్భంగా గ్రామాల అభివృద్ధి పథంలో ముందుకు వెళ్లేందుకు సీఎం పలు విలువైన సూచనలు చేశారని పవన్ తెలిపారు. రాష్ట్రంలోని కొన్ని పంచాయతీల్లో ప్రయోగాత్మకంగా చేపట్టిన 'మేజిక్ డ్రెయిన్ల' పనితీరును పవన్ ఈ సందర్భంగా సీఎం దృష్టికి తీసుకెళ్లారు. అన్ని పంచాయతీల్లో ఈ తరహా డ్రెయిన్లను నిర్మించడం ద్వారా పారిశుధ్య నిర్వహణను మరింత పకడ్బందీగా అమలు చేయవచ్చని వివరించారు. అలాగే, సాగునీటి పారుదల శాఖ పరిధిలోని డ్రైనేజీల్లో పూడికతీత పనులను వేసవిలోనే పూర్తి చేయాలని, దీనివల్ల పంటలు వేసే సమయానికి రైతులకు ఇబ్బందులు ఉండవని కోరారు. అటవీ శాఖ చేపట్టిన 'హనుమాన్ ప్రాజెక్ట్' వివరాలను కూడా పవన్ ముఖ్యమంత్రికి వివరించారు. వికసిత్ భారత్ లక్ష్యంలో భాగంగా సీఎం సూచనలను పాటిస్తూ ముందుకు సాగుతామని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

# నేను, సిద్ధరామయ్య పాలు, తేనె లాంటి వాళ్లం

- మొదటి పేజి తరువాయి

కాంగ్రెస్ పార్టీలో పూర్తి ఐక్యత ఉందని, ముఖ్యమంత్రి సిద్ధరామయ్యతో తన అనుబంధం 'పాలు–తేనె' లాంటిదని ఆయన అభివర్ణించారు. మంగళవారం బెంగళూరులో విలేకరులతో మాట్లాడిన డీకే శివకుమార్.. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై సీఎం సిద్ధరామయ్య ఇచ్చిన వివరణను సమర్థించారు. విపక్ష నాయకులు రాజకీయ దురుద్దేశంతోనే ఈ ఆరోపణలు చేస్తున్నారని, సీఎం అనుభవంతో మాట్లాడారని కొనియాడారు. "మా ఇద్దరి మధ్య బంధం పాలు–తేనెలా కలిసిపోయింది. అన్నింటికీ కాలమే సమాధానం చెబుతుంది" అని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి పదవి మార్పుపై ఇప్పటివరకూ ఎలాంటి చర్చ జరగలేదని డీకే స్పష్టం చేశారు. అలాగే, కర్ణాటక ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (కేపీసీసీ) అధ్యక్షుడిగా తాను ఆరేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా మార్చి 10న ప్రత్యేక విందు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. కేపీసీసీ అధ్యక్ష పదవిలో తన కొనసాగింపుపై స్పందిస్తూ.. కొత్త నాయకత్వం రావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. కేంద్ర మంత్రి హెచ్.డి. కుమారస్వామి, ప్రతిపక్ష నేత ఆర్. అశోక్ చేసిన ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలు నిరాధారమైనవని సీఎం సిద్ధరామయ్య ఇదివరకే కొట్టిపారేశారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తమ మధ్య విభేదాలు సృష్టించేందుకు విపక్షాలు ప్రయత్నిస్తున్నాయని, కానీ తాము పార్టీ హైకమాండ్‌కు కట్టుబడి ఉన్నామని ఇద్దరు నేతలు మరోసారి స్పష్టం చేశారు. లెజిస్లేటివ్ కౌన్సిల్ చైర్మన్ మార్పు విషయంపై సీఎంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని డీకే తెలిపారు.

# జగన్‌ను కలిసిన తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క

- మొదటి పేజి తరువాయి

భట్టివిక్రమార్క మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 5వ తేదీన హైదరాబాద్‌లో జరగనున్న తన కుమారుడు విక్రమాదిత్య వివాహ వేడుకకు హాజరై వధూవరులను ఆశీర్వదించాలని కోరుతూ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా జగన్ వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. వధూవరులు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో నిండైన దాంపత్య జీవితం గడపాలని ఆకాంక్షించారు. కాగా, తన కుమారుడి వివాహానికి రాజకీయ ప్రముఖులను ఆహ్వానిస్తూ భట్టివిక్రమార్క ఆహ్వాన పత్రికలు అందిస్తున్నారు. కొన్ని రోజుల క్రితం ఏపీ సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తదితరులను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు.

## మంగళగిరి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న మంత్రి లోకేశ్ దంపతులు

మంగళగిరి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్, ఆయన అర్ధాంగి బ్రహ్మణి పాల్గొన్నారు. సోమవారం అర్ధరాత్రి 12 గంటలకు నిర్వహించిన శ్రీవారి కల్యాణ మహోత్సవంలో పాల్గొని, రాష్ట్ర ప్రభుత్వం తరపున స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో కీలక ఘట్టమైన శ్రీవారి కల్యాణాన్ని పురస్కరించుకుని ఆలయానికి చేరుకున్న లోకేశ్, బ్రహ్మణి దంపతులకు దేవస్థానం అధికారులు, ధర్మకర్తల మండలి సభ్యులు, స్థానిక నాయకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం వేద మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ జరిగిన స్వామివారి కల్యాణాన్ని వారు భక్తిశ్రద్ధలతో తిలకించారు. కార్యక్రమం ముగిశాక వేద పండితులు మంత్రి దంపతులకు ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు. ఈ పవిత్రమైన కల్యాణ మహోత్సవాన్ని వీక్షించేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో మంగళగిరి క్షేత్రంలో పండుగ వాతావరణం నెలకొంది.

## భారతీయ క్రియేటర్ల శ్రమను దోచుకుంటున్నారు

సోషల్ మీడియా వేదికలపై రాత్రింబవళ్లు శ్రమించి కంటెంట్‌ను సృష్టిస్తున్న భారతీయ క్రియేటర్లకు దక్కాల్సిన న్యాయమైన వాటా దక్కడం లేదని రాజ్యసభ మాజీ సభ్యుడు విజయసాయి రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి అంతర్జాతీయ సంస్థలు భారతీయుల ప్రతిభను తక్కువ ధరకు వాడుకుంటూ, ప్రకటనల ద్వారా వచ్చే భారీ ఆదాయాన్ని తమ జేబుల్లో వేసుకుంటున్నాయని మండిపడ్డారు. యూట్యూబ్ వంటి సంస్థలు ప్రకటనల ఆదాయంలో 55 శాతం క్రియేటర్లకు ఇస్తుండగా, ఇన్‌స్టాగ్రామ్ వంటి ప్లాట్‌ఫామ్‌లు క్రియేటర్లకు ఒక్క రూపాయి కూడా ఇవ్వకపోవడాన్ని ఆయన తప్పుబట్టారు. విదేశీ సంస్థలు తమ ధోరణిని మార్చుకోని పక్షంలో, భారతదేశానికే సొంతంగా ఒక సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఉండాలని ఆయన ప్రతిపాదించారు. 'భారత్ టాక్స్' లాంటి స్వదేశీ ప్రత్యామ్నాయాల మాదిరి, ఒక స్వదేశీ సోషల్ మీడియా యాప్ ఉంటే మన దేశ సంపద విదేశాలకు పోకుండా ఉండటమే కాకుండా, క్రియేటర్లకు మేలు జరుగుతుందని అభిప్రాయపడ్డారు. ఈ సమస్యపై కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తక్షణమే జోక్యం చేసుకోవాలని విజయసాయి రెడ్డి కోరారు. గతంలో అశ్వినీ వైష్ణవ్ క్రియేటర్ల పక్షాన మాట్లాడిన విషయాన్ని గుర్తుచేస్తూ, వారి ఆర్థిక భద్రత, హక్కుల కోసం కఠినమైన చట్టబద్ధ నిబంధనలు తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. భారతీయ క్రియేటర్ల ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వ రంగంలో లేదా స్వదేశీ భాగస్వామ్యంతో కొత్త ప్లాట్‌ఫామ్‌లను ప్రోత్సహించాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన పేర్కొన్నారు. డిజిటల్ ఇండియాలో క్రియేటర్లే వెన్నెముక అని, వారి హక్కులను కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని విజయసాయి రెడ్డి స్పష్టం చేశారు.

## జనసేన పార్టీ ‘ఉద్యమి’ నమోదు జోరు ఏర్పేడు లో ఘన విజయం!

ఏర్పేడు, పెన్ పవర్, మార్చి,03 :
ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి కొట్టే సాయి ప్రసాద్ అధ్యక్షతన ఏర్పేడు పట్టణంలో నిర్వహించిన “ఉద్యమి” సభ్యత్వ నమోదు కార్యక్రమం ఘనవిజయంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కిరణ్ రామిశెట్టి మరియు జనసైనికులు పాల్గొని సభ్యత్వ నమోదు ప్రక్రియను ఉత్సాహంగా కొనసాగించారు. ఉద్యమి సభ్యత్వం పొందిన వారికి పార్టీ గుర్తింపు, కార్యక్రమాల్లో ప్రాధాన్యత, కమిటీల్లో బాధ్యతలు, నాయకత్వ శిక్షణతో పాటు నాయకులుగా ఎదిగే అవకాశాలు లభిస్తాయని నాయకులు తెలిపారు. అదనంగా రూ.5 లక్షల ప్రమాద బీమా సౌకర్యం ద్వారా కుటుంబాలకు భరోసా కల్పించనున్నట్లు వివరించారు. ఫిబ్రవరి 26 నుండి మార్చి 10 వరకు “ఉద్యమి” సభ్యత్వ నమోదు కొనసాగనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు



పెన్ పవర్
రాయలసీమ
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా । తిరుపతి జిల్లా । చిత్తూరు జిల్లా । వై.ఎస్.ఆర్. కడప జిల్లా ।

## క్యాన్సర్ కి నారాయణ హాస్పిటల్ లో ఆరోగ్యశ్రీ ద్వారా వైద్య సేవలు పొందేందుకు పీ.హెచ్.పీలు గ్రామీణ ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించాలి



నెల్లూరు పెన్ పవర్ మార్చ్ 3. డాక్టర్ ఎన్. శ్రీవిద్య, సీనియర్ కన్సల్టెంట్ మెడికల్ ఆంకాలజిస్ట్, నారాయణ మెడికల్ కాలేజీ హాస్పిటల్.
నారాయణ ఆంకాలజీ బ్లాక్ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా నెల్లూరు సిటీ పీ.హెచ్.పీ సభ్యులకు క్యాన్సర్ పై అవగాహన.నారాయణ హాస్పిటల్లో క్యాన్సర్ వైద్య సేవలను ప్రారంభించి విజయవంతంగా ఏడాది పూర్తయిన సందర్భంగా మంగళవారం, నారాయణ హాస్పిటల్ ఏజిఎం అలిమిలి చంద్రశేఖర్ రెడ్డి సహకారంతో జిల్లా పీ.హెచ్.పీ అధ్యక్షులు శాఖవరపు వేణుగోపాల్ అధ్యక్షతన నారాయణ ఆంకాలజి వైద్యులను కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ది పి.ఎం.పి అసోసియేషన్ ఆఫ్ ఇండియా) నెల్లూరు సిటీ సభ్యులు ప్రత్యేకంగా అభినందించి, సత్కరించారు.
అనంతరం జరిగిన క్యాన్సర్ అవగాహన సదస్సులో మెడికల్ ఆంకాలజిస్ట్ డా.యన్.శ్రీవిద్య మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాలలోని ప్రజలకు వ్యాధులగురించి అవగాహన కల్పించడంలో, ప్రాథమిక వైద్య సేవలు అందించడంలో పి.హెచ్.పిలు పాత్ర కీలకమైనదని, క్యాన్సర్ వ్యాధి నివారణ, స్క్రీనింగ్ పరీక్షల యొక్క ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేయాలన్నారు.సర్జికల్ ఆంకాలజిస్ట్ డా.బి.మనోభిరామ్ మాట్లాడుతూ క్యాన్సర్ కి సంబంధించిన అన్ని రకాల చికిత్సలు నారాయణలో అందుబాటులో ఉన్నాయని,ఆరోగ్యశ్రీ పథకంలో ఉచితంగ నిర్వహిస్తున్నామన్నారు. క్యాన్సర్ ను ప్రాథమికదశలో గుర్తించడం ద్వారా నయంచేసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. వార్షికోత్సవం సందర్భంగా మమ్మల్ని అభినందించిన పి.హెచ్.పి సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.రేడియేషన్ ఆంకాలజిస్ట్ డా.గురుసాయి రత్నప్రియ మాట్లాడుతూ రోజురోజుకి క్యాన్సర్ బారినపడే వారి సంఖ్య పెరుగుతుందని, దీనిని నివారించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ముఖ్యంగా ప్రజలకు అందుబాటులో ఉండే పి.హెచ్.పిలు వారి వంతు నిర్వర్తిస్తున్నారని, ప్రజలు కూడా అవగాహన పెంచుకుని క్యాన్సర్ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. క్యాన్సర్ చికిత్సలలో రేడియేషన్ అవసరమైన వారికి నారాయణలో అత్యాధునిక చికిత్సా పద్ధతులు అందుబాటులో ఉన్నాయన్నారు.ఈ సందర్భంగా జిల్లా పి.హెచ్.పి అధ్యక్షులు శాఖవరపు వేణుగోపాల్ మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజం కొరకు, అందుకు కృషి చేస్తున్న వారిని అభినందించేందుకు పి.హెచ్.పి అసోసియేషన్ ఎల్లవేళలా ముందుంటుందని, ఇందులో భాగంగా నారాయణ ఆంకాలజీ బ్లాక్ మొదటి వార్షికోత్సవం జరుపుకున్నవేళ క్యాన్సర్ వైద్య నిపుణులను సత్కరించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో నారాయణ హాస్పిటల్ ఏ.జీ.ఎం. అలిమిలి చంద్రశేఖర్ రెడ్డి,జిల్లా పి.హెచ్.పి అసోసియేషన్నా యకులు శాఖవరపు వేణుగోపాల్,గోరంట్ల శేషయ్య, దేవరకొండ శ్రీనివాసులు, నరసాపురం ప్రసాద్, పి.మోహన్, నెల్లూరు సిటీ సభ్యులు పాల్గొన్నారు.

## టీడీపీ నాయకులు కాసారం మోహన్ రావు, చెంబేటి చిన్నయ లను పరామర్శించిన చేజర్ల





కోవూరు పెన్ పవర్ మార్చ్ 3.
ఇటీవల అనారోగ్యానికి గురై హాస్పటల్ లో చికిత్స పొంది,ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కాసారం మోహన్ రావు కోవూరు మండలం పడుగుపాడు లోని వారి నివాసంలో, తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి చేజర్ల వేంకటేశ్వర రెడ్డి ఈరోజు పరామర్శించారు. ఇటీవల అనారోగ్యానికి గురై హాస్పటల్ లో చికిత్స పొంది,ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న తెలుగుదేశం పార్టీ నాయకులు చెంబేటి చిన్నయ్య కోవూరు మండలం పడుగుపాడు లోని నివాసంలో, తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి చేజర్ల వేంకటేశ్వర రెడ్డి ఈరోజు పరామర్శించారు.వీరి వెంట తెలుగుదేశం పార్టీ నాయకులు చెంబేటి పెంచలయ్య, బత్తల రమేష్, ఇంటూరు విజయ్, గొర్రెపాటి నరసింహరావు,ఇంటూరి విజయ్, ఎస్.కె మహ్మద్, ఎస్ కె వాహిద్, ఎస్.కె రియాజ్ తదితరులు ఉన్నారు

## ఇసుకపాలెం పంచాయితీ లో సందర్శించిన ఎంపిడిఓ యస్.రంతుల్లయ్య







బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ మార్చ్ 3.
ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ కమీషనర్ మరియు సీఈఓ, డీపీఓ, నెల్లూరు వారి ఆదేశాలు మేరకు ఇంటి పన్నులు మరియు పన్నులేతరములు వసూలు చేయుటలో భాగంగా బుచ్చిరెడ్డి పాలెం మండలం లోని ఇసుకపాలెం మరియు మునులపూడి గ్రామ పంచాయతీ లను సందర్శించి ఇంటిపన్నులు వసూలు చేయుటలో బుచ్చిరెడ్డి పాలెం ఎంపీడీఓ యస్. రశీతుల్లయ్య మరియు డిప్యూటీ ఎంపీడీఓ. జి.వి. రాధా క్రిష్ణయ్య పంచాయతీ కార్యదర్శులు యం. శ్రీలత, మేరీ మరియు పంచాయతీ సిబ్బంది పాల్గొనటం జరిగింది.మరియు అన్ని గ్రామపంచాయతి లయందు ఉన్న ఇండ్ల యజమానులకు సకాలములో పన్నులు గ్రామపంచాయతీ కీ చెల్లించండి గ్రామ పంచాయతీ అభివృద్ధికి తొడ్పడండి అని ఎంపీడీఓ ప్రజలకు సూచించారు.

## అంగనవాడిల అరెస్టు చేయడం చూడలేము.. - కళ్లకు చేతులు అడ్డం పెట్టుకొని నిరసన...



నాయుడుపేట, పెన్ పవర్, మార్చి 03
తమకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ విజయవాడలో మహాధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్న అంగన్వాడీలను అరెస్టు చేయడం తాము చూడలేము అంటూ మంగళవారం నాయుడుపేట పట్టణంలో సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలు నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా నాయుడుపేట సిఐటియు కార్యాలయం నుండి మార్కెట్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మార్కెట్ సెంటర్లో కళ్ళకు చేతులు అడ్డం పెట్టుకుని ఈ ఘోరం చూడలేమని,అంగనవాడిలు మహిళలు అని కూడా చూడకుండా అరెస్టు చేయడం సిగ్గు చేటు అని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు శివకవి ముకుందా అంగన్వాడి ప్రాజెక్టు కార్యదర్శి నెలవల శ్యామలమ్మ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారానికి రాక ముందు అంగన్వాడీలు 42 రోజులు సమ్మె చేస్తున్న సందర్భంలో వారి శిబిరాలకు వచ్చి కనీస వేతనం ఇస్తామని వరాలు ఇచ్చి గెలిసిన తర్వాత ఇచ్చిన హామీలను మరిచారని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చమని అడగడానికి వెళ్లిన అంగనవాడీలను మహిళలు అని కూడా చూడకుండా అరెస్టు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు.న్యాయమైన అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని వారన్నారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు విజయనిర్మల, కళావతి, నాగమ్మ,వాణి,మున్సిపాలిటీ వర్కర్స్ యూనియన్ నాయకులు రమణమ్మ, సిఐటియు నాయకులు షేక్ అబ్దుల్లా,షేక్ కాలేషా,ఆటో యూనియన్ నాయకులు మస్తాన్ రెడ్డి,నరేష్ తదితరులు పాల్గొన్నారు.





## అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

**: సిఐటియు జిల్లా కార్యదర్శి గురవయ్య హెచ్చరిక**

శ్రీకాళహస్తి , పెన్ పవర్, మార్చి,03 :
అరచేత్తో సూర్యుడిని ఆపలేనట్లే, అరెస్టులతో అంగన్వాడీ ఉద్యమాన్ని అణచివేయలేరని సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సిఐటియు) జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య స్పష్టం చేశారు. తమ డిమాండ్ల సాధనలో భాగంగా అమరావతిలో శాంతియుతంగా ధర్నా చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలను పోలీసులు అక్రమంగా నిర్బంధించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆయన విమర్శించారు.ఈ ఘటనను ఖండిస్తూ శ్రీకాళహస్తిలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద సిఐటియు, ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఎఐటియూసీ), ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ (ఐఎఫ్టియు) ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అంగన్వాడీ సిబ్బంది సమాజానికి కీలక సేవలు అందిస్తున్నప్పటికీ, వారి న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోకపోవడం దురదృష్టకరమన్నారు.ప్రభుత్వం వెంటనే చర్చలకు రావాలని, అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. డిమాండ్లు నెరవేర్చేంతవరకు ఉద్యమం కొనసాగుతుందని హెచ్చరించారు. ఈ నిరసనలో పలువురు అంగన్వాడీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శవాలు మధ్య శృంగారం బాడీలు మధ్య బోల్డ్ ‘

నెల్లూరు
పెద్దాసుపత్రిలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఇంకా కొందరిని సిబ్బందిని సైతం బెదిరిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్న బయటకు పొక్కకుండా జాగ్రత్తలు. శవాలు మధ్య రొమాన్స్ కావాలని వేధిస్తున్న డాక్టర్.నెల్లూరు పెద్దాసుపత్రి లో పని చేస్తున్న మహిళా ఉద్యోగినితో అసభ్యం గా ప్రవర్తిస్తున్న డాక్టర్ సురేష్. ఆసుపత్రిలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగినితో డాక్టర్ సురేష్ అనే వ్యక్తి అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని, శవాల మధ్య రొమాన్స్ కావాలని వేధిస్తున్నారని బాధితులరాలు పేర్కొంది.కులం పేరుతో వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసింది.తనకు న్యాయం చేయాలని, ఈ ఘటనపై విచారణ జరగాలని బాధితురాలు కోరుతున్నారు.



## ఆర్థిక సాయం అందించిన వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ మార్చ్ 3
బుచ్చిరెడ్డిపాలెం శాంతినగర్ లో కరిముల్లా తోపుడు దుకాణం అగ్ని ప్రమాదంలో తోపుడు మిషన మోటార్లు కాలీపోయాయి స్థానిక టిడిపి నాయకుడు రామానాయుడు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు ఆమె వెంటనే స్పందించిన వాళ్లకి 50 వేల రూపాయలు అందజేశారు కాలిపోయిన మోటార్లను రిపేర్లు చేయించి అందజేయడం జరిగింది వేమిరెడ్డి దంపతులుకు రుణపడి ఉంటామని టిడిపి నాయకుడు రామానాయుడు కూడా కృతజ్ఞతలు తెలిపారు



## చంద్ర గ్రహణం కారణంగా శ్రీవారి ఆలయం మూత

### టీటీడీ అదనపు ఈవో శ్రీ సి.హెచ్.వెంకయ్య చౌదరి.

తిరుమల/పెన్ పవర్/మార్చి 03 చంద్ర గ్రహణం కారణంగా మంగళవారం ఉదయం 9 గంటలకు శ్రీవారి ఆలయం మూసివేసినట్లు టీటీడీ అదనపు ఈవో శ్రీ సి.హెచ్.వెంకయ్య చౌదరి తెలియజేశారు.ఆలయ ద్వారాలు మూసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ క్యూలైన్ లో ఉన్న ప్రతి భక్తుడికి దర్శనం చేయించి అనంతరం ఆలయ ద్వారాలు మూసివేనట్లు చెప్పారు. ఆలయ మూత సమయంలో మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్న ప్రసాద కేంద్రం, లడ్డూ విక్రయ కేంద్రాలు కూడా మూసి వేస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో భక్తులకు అన్ని చోట్ల పులిహోర ప్యాకెట్లు అందుబాటులో ఉంచామని చెప్పారు. సాయంత్రం ఆలయ శుద్ధి, పుణ్యాహావచనం అనంతరం భక్తులను క్యూలైన్లలోకి అనుమతిస్తామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో టీటీడీ సీవీఎస్వో శ్రీ మురళీకృష్ణ, తిరుపతి ఎస్పీ శ్రీ సుబ్బరాయుడు, శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో శ్రీ లోకనాథం, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# అంగన్వాడీలపై దాడులను ఖండించిన సి.ఐ.టి.యు నాయకులు

గూడూరు, పెన్ పవర్,మార్చి,03:

అంగన్వాడి కార్యకర్తలపై రాష్ట్ర ప్రభుత్వ చర్యలను ఖండిస్తూ సి.ఐ.టి.యు నాయకులు గూడూరులో నిరసన చేపట్టారు. ఫిబ్రవరి 23వ తేదీ నుంచి ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ (సి.ఐ.టి.యు అనుబంధం) ఆధ్వర్యంలో తమ సమస్యల పరిష్కారం కోసం దశలవారీగా రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. వారం రోజులుగా దీక్షలు సాగుతున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడంతో మార్చి 2న "చలో విజయవాడ" కార్యక్రమాన్ని నిర్వహించారు.విజయవాడలోని ధర్నా చౌక్ వద్ద అంగన్వాడి కార్యకర్తలు శాంతియుతంగా ధర్నా చేపట్టారు. అయితే మంగళవారం తెల్లవారుజామున ధర్నా శిబిరాన్ని పోలీసులు భగ్నం చేసి, అంగన్వాడి నాయకులు, కార్యకర్తలను అరెస్ట్ చేసి వివిధ ప్రాంతాలకు తరలించినట్లు సమాచారం. ఈ చర్యలను నిరసిస్తూ రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు గూడూరులో పాత బస్టాండ్ సమీపంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు.నాయకులు మాట్లాడుతూ, అంగన్వాడి మహిళా కార్యకర్తలపై పోలీసులు దౌర్జన్యంగా ప్రవర్తించారని ఆరోపించారు. ముందస్తు సమాచారం లేకుండా శిబిరంపై దాడి చేసి, మహిళలను




బలవంతంగా బయటకు పంపడమే కాకుండా లాఠీలతో దాడులు జరిపినట్లు తెలిపారు. ధర్నాలో పాల్గొన్న నాయకులను అరెస్ట్ చేసి సుదూర పోలీస్ స్టేషన్లకు తరలించడం దారుణమని విమర్శించారు. టెంట్లు కూల్చివేసి, కార్యకర్తలు తిరిగి ఒకచోట చేరకుండా అడ్డుకోవడం ప్రజాస్వామ్య హక్కుల ఉల్లంఘనగా పేర్కొన్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం అంగన్వాడి కార్యకర్తల సమస్యలను చర్చించి పరిష్కరించాలని సి.ఐ.టి.యు నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సంఘం అధ్యక్షురాలు ఏ. ఇంద్రావతి, కార్యదర్శి బి.ఎస్. ప్రభావతి, సెక్టార్ లీడర్లు, గూడూరు ప్రాంతీయ కార్యదర్శి జోగి శివకుమార్, సి.ఐ.టి.యు పట్టణ ప్రధాన కార్యదర్శి బి.వి. రమణయ్య, నాయకులు బి. చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఇఫ్తార్ విందు కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ను మర్యాదపూర్వకంగా కలిసిన పఠాన్ ఖాదర్ బాషా

గూడూరు, పెన్ పవర్, మార్చి,03:



పవిత్ర రమజాన్ మాసం సందర్భంగా విజయవాడలో నిర్వహించిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ను గూడూరు నియోజకవర్గ మైనారిటీ అధ్యక్షులు పఠాన్ ఖాదర్ బాషా మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఖాదర్ బాషా రమజాన్ శుభాకాంక్షలు తెలియజేసి, గూడూరు నియోజకవర్గానికి సంబంధించిన మైనారిటీ సమస్యలు, అభివృద్ధి అంశాలపై చర్చించినట్లు తెలిపారు. మైనారిటీల సంక్షేమం, విద్య, ఉపాధి అవకాశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని షర్మిల ను కోరినట్లు చెప్పారు.వైఎస్ షర్మిల కూడా మైనారిటీల అభ్యున్నతికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని, వారి సమస్యలను పరిష్కరించేందుకు కాంగ్రెస్ పార్టీ ఎల్లపుడు కృషి చేస్తుందని ఈ సందర్భంగా ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, మైనారిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని వైద్య శిబిరం నిర్వహణ.

**- శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థినులతో పరస్పర చర్చా కార్యక్రమం.**

**- పోలీస్ యూనిట్ హాస్పిటల్ వైద్యులచే ఉచిత వైద్య సేవలు.**



తిరుపతి/పెన్ పవర్/మార్చి 03

తిరుపతి జిల్లా ఎస్పీ శ్రీ ఎల్ సుబ్బరాయుడు, ఐపిఎస్., గారి ఆదేశాల మేరకు, అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల సందర్భంగా ఈరోజు పద్మావతి మహిళ డిగ్రీ కళాశాల తిరుపతి, లో ప్రత్యేక పరస్పర చర్చా కార్యక్రమం మరియు వైద్య శిబిరాన్ని నిర్వహించారు.మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ శ్రీమతి శ్రీలత గారి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో, పోలీస్ యూనిట్ హాస్పిటల్‌కు చెందిన డా. మాధురి విద్యార్థినులకు ఆరోగ్య సంరక్షణ, పోషణ, మహిళలలో సాధారణంగా కనిపించే ఆరోగ్య సమస్యలు మరియు వాటి నివారణపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో శక్తి టీమ్ సభ్యులు కూడా పాల్గొని మహిళల భద్రత, సైబర్ నేరాల నివారణ, అత్యవసర సమయంలో పోలీస్ సహాయం పొందే విధానం వంటి అంశాలపై వివరించారు.ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థినులు మరియు బోధన/బోధనేతర సిబ్బంది కలిపి మొత్తం 250 మంది పైగా పాల్గొన్నారు.విద్యార్థినులతో నేరుగా మమేకమై వారి సందేహాలకు సమాధానాలు ఇవ్వడం ద్వారా మహిళల సాధికారత, ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు పోలీసులు కట్టుబడి ఉన్నారని తెలిపారు.మహిళల ఆరోగ్యం, భద్రత మరియు హక్కుల పరిరక్షణలో తిరుపతి జిల్లా పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని అధికారులు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో తమీమ్ అహ్మద్ ఇన్‌స్పెక్టర్, మరియు మహిళా పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు

# ఉద్యోగాల పేరుతో దళితులను మోసం చేసిన దంపతులపై చర్యలు తీసుకోవాలి...

## అంబేద్కర్ న్యాయ హక్కుల పోరాట సమితి డిమాండ్

గూడూరు, పెన్ పవర్,మార్చి 03:

ఉద్యోగాల పేరుతో దళితులకు చెందిన పలువురిని మోసం చేసి లక్షల రూపాయలు దండుకున్నారని ఆరోపిస్తూ బాధితులకు న్యాయం చేయాలని అంబేద్కర్ న్యాయ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు జాలారి శ్రీనివాసులు డిమాండ్ చేశారు.గూడూరు పట్టణంలోని ఓ ప్రైవేటు భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తిరుపతి జిల్లా బాలాయపల్లి గ్రామానికి చెందిన రావి దేవిక చౌదరిరమేష్ దంపతులు ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మబలికి పలువురి వద్ద భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేశారని ఆరోపించారు. కోవూరు గ్రామానికి చెందిన ముసలి ఆదిలక్ష్మి వద్ద రూ.5 లక్షలు, రాపూరు మండలం గిలకపాడు గ్రామానికి చెందిన కుంచెం ఏడుకొండలు వద్ద రూ.2 లక్షలు, రాపూరు గ్రామానికి చెందిన పచ్చిగళ్ళ పవన్ కళ్యాణ్ వద్ద రూ.3 లక్షలు తీసుకున్నట్లు తెలిపారు.సుమారు ఐదేళ్లుగా కాలయాపన చేస్తూ ఉద్యోగాలు ఇప్పించకపోగా, డబ్బులు తిరిగి ఇవ్వకుండా మోసం చేస్తున్నారని ఆరోపించారు.



ఇదే విధంగా మరికొందరి వద్ద కూడా లక్షలు గుంజుకున్నారని పేర్కొన్నారు. వెంటనే బాధితుల నుంచి తీసుకున్న నగదు మొత్తాన్ని తిరిగి చెల్లించాలని, లేని పక్షంలో రావి దేవిక చౌదరిరమేష్ దంపతుల ఇంటి ఎదుట ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

ఇప్పటికే ఈ విషయమై నెల్లూరు జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు జాలారి శ్రీనివాసులు తెలిపారు. బాధితురాలు ముసలి ఆదిలక్ష్మి మాట్లాడుతూ, తన కుమారుడికి ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మబలికి రూ.5 లక్షలు తీసుకున్నారని, ఇప్పుడు డబ్బులు అడిగితే బెదిరింపులకు దిగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో బాధితులు కుంచెం ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబుకి దేవుడంటే భక్తి,భయం,రెండూ లేవు -కాకాణి

నెల్లూరు పెన్ పవర్ మార్చ్ 3.

టీటీడీ పవిత్రతను తాకట్టు పెట్టిన చంద్రబాబు ఆలయ ప్రతిష్టను దిగజార్చిన బీఆర్ నాయుడు స్త్రీ లోలుడని తెలిసినా చైర్మన్ పదవి ఎలా ఇచ్చారు బీఆర్ నాయుడిని తక్షణమే పదవి నుంచి తొలగించాలి మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి డిమాండ్.నెల్లూరు జిల్లా వైయస్సార్సీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన జిల్లా పార్టీ అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి.భక్తుల మనోభావాలతో ఆడుకుంటున్న కూటమి ప్రభుత్వం. మా ప్రభుత్వ హయాంలో పృథ్వీపై వేటు.. నేడు నాయుడికి సమర్ధనా చంద్రబాబు ద్వంద్వ నీతిపై కాకాణి నిప్పులు.నెయ్యి కొనుగోళ్లలో హెరిటేజ్ బినామీల దోపిడీ రూ. 658 అడ్డగోలుగా కట్టబెట్టిన చంద్రబాబు టీటీడీని రాజకీయ అడ్డాగా మార్చిన ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేసిన మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి

కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి కొలువున్న తిరుమలలో వరుస అపచారాలతో స్వామి వారి పవిత్రతను కూటమి ప్రభుత్వం దెబ్బతీస్తోందని నెల్లూరు జిల్లా వైయస్సార్సీపీ అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మంగళవారం నెల్లూరు లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.... తిరుమల కొండపై మద్యం, రీల్స్, ఫోటో షూట్లు వంటి నిషిద్ధ కార్యకలాపాలు పెరిగిపోయాయని, భక్తుల రక్షణపై పాలకమండలికి నియంత్రణ కరువైందని కాకాణి ఆందోళన వ్యక్తం చేశారు. టీటీడీ చైర్మన్ పదవిలో ఉన్న వ్యక్తికి నిష్కళంకమైన వ్యక్తిత్వం ఉండాలి. కానీ, ప్రస్తుతం బీఆర్ నాయుడు చుట్టూ తిరుగుతున్న అసభ్యకర వీడియోలు భక్తుల మనోభావాలను తీవ్రంగా గాయపరుస్తున్నాయిని ఆక్షేపించారు. ఏ ఐ ద్వారా ఆ వీడియోలు ఒరిజనల్ అని తేలినా, చంద్రబాబు ప్రభుత్వం స్పందించకపోవడం దారుణం" అని మండిపడ్డారు. ఆలయ పవిత్రతను కాపాడటానికి బీఆర్ నాయుడిని తక్షణమే చైర్మన్ పదవి నుంచి తొలగించాలని లేదా ఆయనతో రాజీనామా చేయించాలని కాకాణి గోవర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఇంకా ఏమన్నారంటే...

కూటమి పాలనలో తిరుమలలో అనేక వరుస దుర్ఘటనలు చోటుచేసుకోవడం దురదృష్టకరం. భక్తుల విశ్వాసాలను, ఆకాంక్షలను పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ... పాలకమండలి అనేక తప్పిదాలకు పాల్పడుతుంది. వివాదాలకు కేంద్ర బిందువుగా మారుతోంది. అత్యంత భక్తితో పుణ్యదర్శనానికి వచ్చిన భక్తులు ఏకంగా ప్రాణాలు కోల్పోవాల్సిన దుస్థితి నెలకొంది. వీటికి తోడు తిరుమలలోనే మద్యపానం, రీల్స్, ఫోటో షూట్ లు వంటి వరుస అపచారాలు, నిషిద్ధ కార్యకలాపాలు జరుగుతున్నా...వాటిపై నియంత్రణ కరువైంది. వీటికి తోడు కూటమి ప్రభుత్వం లడ్డూ ప్రసాదంపై అడ్డగోలు ఆరోపణలు చేసి... స్వామి వారి ప్రతిష్టను మరింత మసకబార్చే ప్రయత్నం చేసింది.ఆలయ ప్రతిష్టను మసకబార్చిన బీ ఆర్ నాయుడు..తిరుమలలో జరిగే అన్ని కార్యకలాపాలకు పాలకమండలి చైర్మన్ బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఆయన కనుసన్నల్లో పరిపాలన జరుగుతుంది. అంత పవిత్రమైన ఆలయ నిర్వహణ చేయాల్సిన వ్యక్తికి నిష్కళంకమైన వ్యక్తిత్వం, అచంచలమైన భక్తి ఉండాలి. భక్తుల మనోభావాలను కాపాడాల్సిన చిత్తశుద్ధి కూడా ఉండాలి. అలాంటి ప్రతిష్టను దిగజార్చేలా సీఎం చంద్రబాబు ఆ స్థానాన్ని రాజకీయ వేదికగా మార్చడాన్ని భక్తులు జీర్ణించుకోలేక పోతున్నారు.

ఇటీవల టీటీడీ చైర్మన్ బీ ఆర్ నాయుడు వీడియోలు సోషల్ మీడియాలో సర్క్యులేట్ అవుతున్నాయి. ఇవన్నీ చూసిన తర్వాత పవిత్రమైన టీటీడి నిర్వహణకు సీఎం చంద్రబాబు ఇలాంటి వ్యక్తిని నియమించాడా? అని భక్తులు కలత చెందుతున్నారు. బీ ఆర్ నాయుడు తన మీద విడుదలైన వీడియోల్ డీఫ్ ఫేక్ అని చెప్పాడు... కానీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా అవి ఒరిజనల్ వీడియోలే అని నిర్ధారణ అయింది. అప్పుడు వివరణ ఇవ్వడానికి ప్రయత్నిస్తూ... తాను 30 ఏళ్లుగా ఆ మహిళ కుటుంబంతో సన్నిహిత సంబంధాలున్నాయని చెప్పుకొచ్చాడు. కానీ 2024 ఎన్నికలకు ముందే ఆ మహిళ చంద్రబాబుకు లేఖ రాస్తూ... మాజీ సీఎం, కాబోయే సీఎం అని సంబోధించింది. అదే టైంలో బీ ఆర్ నాయుడు ఎలాంటి వ్యక్తో, ఎంత దారుణమైన స్త్రీ లోలుడో లెటర్ లో ఫిర్యాదు చేసింది. బీ ఆర్ నాయుడు రాజ్యసభ సభ్యత్వమో, టీటీడీ చైర్మన్ పదవో ఆశిస్తున్నాడు. ఆయన మహిళలను విపరీతంగా వేధిస్తాడు. మీరే నాకు న్యాయం చేయండి అని లేఖ రాసింది. అలాంటప్పుడు టీటీడీ పవిత్రతను దృష్టిలో పెట్టుకుని అలాంటి ఆరోపణలు వచ్చిన పేరు కూడా చైర్మన్ పదవికి పరిగణలోకి తీసుకోరు. ముందే తెలిసినా ఎలా నియమిస్తారు కానీ బాధిత మహిళ తాను చంద్రబాబుతో పాటు పవన్ కళ్యాణ్, లోకేష్ లకు కూడా లేఖ రాసినా... మీరు స్పందించలేదు. దేవుడి ప్రతిష్టను కాపాడే వారికి ఆ పదవిలో నియమించాల్సింది పోయి.. ఇన్ని రకాల ఆరోపణలు ఉన్నా.. కేవలం బీ ఆర్ నాయుడు మీకు మీడియా ద్వారా వంతపాడాడు అన్న స్వార్ధ రాజకీయ ప్రయోజనాల కోసం కోట్లాది మంది భక్తుల మనోభావాలను గాయపరుస్తూ... టీటీడీ చైర్మన్ పదవి కట్టబెట్టారు. ఇది ముమ్మాటికీ దురదృష్టకరం. దేవుడు మీద నిజంగా భక్తి ఉంటే ఇలాంటి ఆరోపణలు వచ్చిన వ్యక్తిని ఏ విధంగా ఆ పదవిలో కూర్చోబెడతారు? మీ నియామకం ద్వారా మీకు




స్వామి అంటే భయం, భక్తితో పాటు నిష్ట కూడా లేదని స్పష్టమైంది వైయస్.జగన్ కు మీకు ఇదే తేడా చంద్రబాబూ.మరలా తన ఉదంతాన్ని సమర్ధించుకోవడానికి నిస్సిగ్గుగా వ్యవహరిస్తున్నారు. ఆ వీడియోలో ఏం తప్పు ఉందని మాట్లాడుతుంటే... ఇంతకన్నా సిగ్గు చేటు మరొకటి ఉండదు చంద్రబాబూ. అంటే నీతులు ఎదుటివారికి చెప్పడానికే తప్ప మీరు ఆచరించరు అని అర్ధం అవుతుంది. మీ మీడియా ద్వారా ప్రపంచానికి నీతులు చెబుతారే తప్ప.. మీరు మాత్రం వాటిని ఆచరించరు అన్నది కూడా బీ ఆర్ నాయుడు చేష్టలు ద్వారా తెలుస్తుంది. గతంలో ఎస్వీ బీసీ చైర్మన్ పై ఒక ఆడియో విడుదలైతే.. తక్షణమే అప్పటి సీఎం వైయస్.జగన్ ఆయన్ను రాజీనామా చేయించారు. కేవలం స్వామి వారి ప్రతిష్ఠ మసకబారకూడదని... స్వామి వారి సేవలో ఉన్న వ్యక్తులు నిష్టతో ఉండాలని ఆ పదవి నుంచి తొలగించారు. మీకు ఆ నిబద్దత లేదు, నీతి లేదు. జరిగిన ఘటనపై విచారణ చేయలేదు సరికదా, ఆ ఘటనను సమర్ధిస్తూ... మిమ్మల్ని ప్రశ్నించేవారిదే తప్పు అన్నట్టు వ్యవహరించడం క్షమించరాని నేరం. మీ అనుభవం అనేక ఆనర్ధాలకు దారి తీస్తుందన్న విషయం గుర్తుంచుకొండి చంద్రబాబూ బీ ఆర్ నాయుడు విషయంలో చంద్రబాబు రెండు తప్పులు...బాధిత మహిళ తన ఆవేదనతో లేఖ రాసి.. పదవి ఇవ్వకముందే ఆయన ఎలాంటి స్త్రీ లోలుడో చెబుతూ మీకు ఫిర్యాదు చేస్తే... అలాంటి వ్యక్తికి పవిత్రమైన టీటీడీ చైర్మన్ పదవి ఇవ్వడం మొదటి తప్పు అయితే.... ఆధారాలతో సహా ఆయన వీడియోలు బయటపడిన తర్వాత తక్షణమే ఆయన్ను పదవి నుంచి తొలగించాల్సింది పోయి.. ఇంకా మీనమేషాలు లెక్కిస్తూ ఆయన తరపున వకాల్తా పుచ్చుకుని, మీరు బుకాయించడం అత్యంత దుర్మార్గం. మీ చేష్టల ద్వారా స్వామి వారి పట్ల భయం, విశ్వాసం, భక్తి లేవన్న విషయం మరోసారి స్పష్టమైంది.ప్రతిసారీ అప్రతిష్ట మాటలే. బీ ఆర్ నాయుడు గతంలో పవిత్రమైన ఏడుకొండలు వాడు అని మనం సంబోధిస్తే ఏడు కొండల తర్వాత ఎనిమిదో కొండ చెత్త కొండ ఉందని చెత్త మాటలు మాట్లాడిన నీచుడు, భగవద్గీత లో ఏముంది దానిపై ఉమ్మేస్తున్నారు అని నీచంగా పరమ పవిత్రమైన గ్రంథం గురించి మాట్లాడిన వ్యక్తి బీ ఆర్ నాయుడు. ధర్మ పథం గురించి మానవాళికి బోధించిన గ్రంథం గురించి నోటికొచ్చినట్లు మాట్లాడ్డం దారుణం. వీడియో విడుదల చేసిన వారి గురించి మాట్లాడుతూ వారి అంతు చూస్తానని మాట్లాడుతున్నాడు. నీ సంగతి భగవంతుడే తేల్చాడు. దాని గురించి సమాధానం చెప్పకుండా.. నాకు పనీపాటా లేదా అని వ్యంగ్యంగా మాట్లాడుతున్నావు. నీ పనీ పాటా గురించి అందరికీ అర్ధం అయింది బీ ఆర్ నాయుడూ, నువ్వు చేసిన పనుల వల్ల భగవంతుడి సేవకి నువ్వు పనికిరావు, నీకా అర్హత లేదన్న విషయం స్పష్టమైంది. ఓ పనికిమాలిన ఛానెల్ ని అడ్డుపెట్టుకుని.. అబద్దపు కథనాలు ప్రసారం చేసి, బెదిరించాలని చూస్తే భయపడేవారు లేరు.మీరు ఇప్పటికే లెక్కకు మించిన పొరపాట్లు చేశారు. లడ్డూ ప్రసాదం విషయంలో సిట్ నివేదిక ద్వారా మీ తప్పులు బహిర్గతమయ్యాయి. ఒక్కొక్కటిగా మీ బాగోతాలు కడా బయటపడుతున్నాయి. నెయ్యి సరఫరా విషయంలో కూడా మీ అక్రమాలు బయటకు వస్తున్నాయి. 2014-19 మధ్య నెయ్యి సగటున కేజీ రూ.330 ఉంటే, ఇవాళ హెరిటేజ్ కు చెందిన మీ మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీ ఇందాపూర్ ద్వారా రూ.658 కు కేజీ నెయ్యి కొనుగోలు చేయడం ద్వారా మీ ఆర్ధిక, రాజకీయ ప్రయోజనాలను నెరవేర్చుకుంటున్నారు. మీరు ఆకాశం మీద ఉమ్మి వేసే ప్రయత్నం చేస్తూ.. తిరిగి వైయస్.జగన్ మీద నిందవేసే ప్రయత్నం చేస్తున్నారని కాకాణి గోవర్ధన్ రెడ్డి మండిపడ్డారు. ఇప్పటికైనా ఆలయ పవిత్రతను, ప్రాశస్త్యాన్ని కాపాడ్డానికి బీ ఆర్ నాయుడుని టీటీడీ చైర్మన్ పదవి నుంచి తొలగించడం ద్వారా, భక్తుల మనోభావాలను గౌరవించాలని కాకాని గోవర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు.

# నల్ల రిబ్బన్లతో స్విమ్స్ కార్మికుల నిరసన

తిరుపతి/ /పెన్ పవర్/మార్చి 03
స్విమ్స్ కార్మికులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు నేడు మంగళవారం నాటికి 5వ రోజుకు చేరుకున్నాయి. ఐదు రోజులుగా శాంతియుతంగా ఆందోళన కొనసాగిస్తున్నప్పటికీ స్విమ్స్టీటీడీ యాజమాన్యాల మొండి వైఖరి మారకపోవడంతో, కార్మికులు తమ నిరసనను మరింత తీవ్రతరం చేస్తూ నేడు నల్ల రిబ్బన్లు ధరించి విధులకు హాజరయ్యారు.
ఐదవ రోజు దీక్షా కార్యక్రమంలో కార్మికులను ఉద్దేశించి సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఎస్. జయచంద్ర ప్రసంగించారు. ఉదయం 8 గంటల నుండి 9 గంటల వరకు గంటపాటు కార్మికులందరూ విధులు బహిష్కరించి రిలే నిరాహార దీక్షలో కూర్చున్న వారికి మద్దతుగా కూర్చుని రిలే నిరాహార దీక్షలో కార్మికులందరూ ఏకగ్రీవంగా పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు. యాజమాన్యానికి కార్మికులపై కనికరం లేకుండా వ్యవహరిస్తున్న తీరును ఖండిస్తూ, కనీసం శ్రీ వెంకటేశ్వర స్వామికీకైనా తమ మీద దయ కలిగి సమస్యలు పరిష్కారం కావాలనే ఆశతో కార్మికులు ఉదయం స్వామి చిత్రపటానికి పూజలు నిర్వహించారు. "ఏడుకొండలవాడా వెంకటరమణా గోవిందాడ మా సమస్యలను పరిష్కరించు" అంటూ ప్రార్థిస్తూ,



టీటీడీస్విమ్స్ యాజమాన్యాల మనసు మార్చి కార్మికుల బ్రతుకుల్లో మార్పు తేవాలని వేడుకున్నారు. గత నాలుగేళ్ల క్రితం కార్పొరేషన్‌లో విలీనం చేసినప్పటి నుండి శానిటేషన్ విధానాన్ని రద్దు చేసి వేతనాలు పెంచాలని అధికారులు చుట్టూ తిరుగుతూ, ఎన్నో సార్లు వినతిపత్రాలు ఇచ్చినా సమస్యలను పట్టించుకోకపోవడం పట్ల తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగేళ్లుగా ప్రాధేయపడుతున్న కార్మికుల సమస్యలను విస్మరించడం అధికారుల వైఫల్యమని, ఆ తప్పులను సరిదిద్దుకోవాలని విమర్శించారు. కార్మికుల సహనాన్ని పరీక్షించకుండా తక్షణమే యాజమాన్యం చర్చలకు రావాలని, సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జరగబోయే పరిణామాలన్నిటికీ యాజమాన్యమే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నేత జి. బాలసుబ్రమణ్యం, స్విమ్స్ వర్కర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే. వేణుగోపాల్, యూనియన్ కార్యదర్శి జి. రవి, అధ్యక్షులు వి. సూరి, కోశాధికారి మారి ముత్తు, కమిటీ సభ్యులు గోపి, వెంకటేష్, జనార్ధన్, కోటయ్య, రాజా కుమారి తదితరులు పాల్గొన్నారు

# రూ.31 కోట్లతో 28 ఓవర్ హెడ్ ట్యాంకులు పూర్తి

## - రేపల్లెలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

## : రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్.

రేపల్లె /పెన్ పవర్/మార్చి 03
రేపల్లె నియోజకవర్గంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించే దిశగా భారీ ప్రణాళిక అమలవుతోందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. రూ.31 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న 28 ఓవర్ హెడ్ ట్యాంకులు మరియు పైప్‌లైన్ పనులు పూర్తికి చేరుకున్నాయని ఆయన వెల్లడించారు. నియోజకవర్గ అభివృద్ధిని ప్రథమ ప్రాధాన్యంగా తీసుకుని సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని మంత్రి పేర్కొన్నారు. త్రాగునీరు, రహదారులు, డ్రైనేజీ, విద్య వంటి మౌలిక వసతుల బలోపేతంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. "ఇంటింటికి కుళాయి" లక్ష్యంతో ప్రతి గ్రామానికి శుద్ధమైన త్రాగునీరు అందించేందుకు అధికారులు, ఇంజినీరింగ్ విభాగాలతో తరచూ సమీక్షలు నిర్వహిస్తూ పనులను వేగవంతం చేస్తున్నామని చెప్పారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా పనులు పూర్తిచేయాలనే సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందని ఆయన స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో సంవత్సరాలుగా నెలకొన్న నీటి కొరత సమస్యలు ఈ ప్రాజెక్టుల ద్వారా పూర్తిగా నివృత్తి కానున్నాయని తెలిపారు. ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకుని తక్షణ చర్యలు తీసుకోవడం తన విధిగా భావిస్తున్నానని మంత్రి అన్నారు. రేపల్లె అభివృద్ధి దిశగా దీర్ఘకాలిక ప్రణాళికలతో ముందుకు సాగుతూ "ప్రజలతో కలిసి ప్రజల కోసమే" అనే ధ్యేయంతో సేవలందిస్తున్నామని తెలిపారు. నియోజకవర్గ ప్రజలు ఈ అభివృద్ధి పనులకు సహకరించాలని మంత్రి పిలుపునిచ్చారు

# ఇఫ్తార్ సందర్భంగా మస్జిద్‌కు బోండాలు, ఖర్జూరాలు అందజేసిన లైన్‌మెన్ ప్రభాకర్.



రేపల్లె /పెన్ పవర్/మార్చి 03
పవిత్ర రమజాన్ మాసం సందర్భంగా స్థానిక కరెంటు లైన్‌మెన్ ప్రభాకర్ మస్జిద్‌లో నిర్వహించిన ఇఫ్తార్ కార్యక్రమానికి బోండాలు, ఖర్జూర పండ్లు అందజేశారు. ఉపవాస దీక్షలో ఉన్న ముస్లిం సోదరులకు ఇఫ్తార్ సమయంలో ఇవి ఉపయోగపడాలని ఆకాంక్షిస్తూ ఆయన ఈ సహాయాన్ని చేశారు. ప్రభాకర్ చేసిన ఈ సేవా కార్యక్రమాన్ని మస్జిద్ కమిటీ సభ్యులు, స్థానికులు అభినందించారు. సమాజంలో సౌభ్రాతృత్వం, మతసామరస్యం పెంపొందించే విధంగా ఆయన చేసిన ఈ కార్యక్రమం ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు అల్లా మంచి చేయాలని, ఆయురారోగ్యాలతో క్షేమంగా ఉండాలని మనస్ఫూర్తిగా మసీదు పెద్దలు ప్రార్థించారు.

# అసత్య ఆరోపణలు నమ్మవద్దు.. పద్మా నగర్ అభివృద్ధి నా ధ్యేయం...

## -భూ కబ్జా ఆరోపణలు అవాస్తవం.. -అక్రమాలకు తావులేదు...

## -టిడిపి నేత రాజశేఖర్ రెడ్డి

రేణిగుంట: మార్చ్ 3, పెన్ పవర్
మండలం జీ పాలెం పంచాయితీ పరిధిలోని ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్నారంటూ తనపై వస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమని జి పాల్యం తెలుగుదేశం పార్టీ నేత రాజశేఖర్ రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కుర్ర కాలువ లెక్కదాకాల సర్వే నంబర్లు 5,208,209, లోని 4.21 ఎకరాల ప్రభుత్వ భూమిని కేవలం అంగన్వాడి కేంద్రాలు పాఠశాలలు స్మశాన వాటిక వంటి ప్రజా అవసరాలకే వినియోగిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి సహకారంతో రూ.25 లక్షలతో గ్రామంలో సిసి రోడ్లు వీధి దీపాలు ఏర్పాటు చేశామన్నారు. అభివృద్ధిని ఓర్వలేక విపక్షాలు కుట్రపూరితంగా ఆరోపణలు చేస్తున్నాయని అక్రమ కట్టడాలను తాము ఎక్కడ ప్రోత్సహించబోమని ఆయన పేర్కొన్నారు. పద్మా నగర్ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని టిడిపి నాయకుడు రాజశేఖర్ రెడ్డి అన్నారు. తనపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. భవిష్యత్ తరాల కోసం ప్రభుత్వ స్థలాలను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో



ఇప్పటికే గ్రామంలో జంగిల్ క్లీనింగ్ రోడ్ల నిర్మాణం చేపట్టామని వివరించారు. త్వరలో 60 అడుగుల రహదారి డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరుస్తామని ఆయన హామీ ఇచ్చారు రాజకీయలబ్దికోసం అసత్య ప్రచారం చేసే వారిని ప్రజలు నమ్మవద్దని కోరారు.

# శరవేగంగా జరుగుతున్న బొందల గరువు గ్రామంలో అభివృద్ధి పనులు

రేపల్లె /పెన్ పవర్/మార్చి 03
రేపల్లె మండలం బొందలగరువు గ్రామంలో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయి త్రాగునీరు సిసి రోడ్లు విద్యుత్ సదుపాయాలు డ్రైనేజీ వ్యవస్థలు మెరుగుదలతో పాటు గ్రామ మౌలిక సదుపాయాల అభివృద్ధికి చర్యలు చేపట్టడంతో గ్రామం రూపురేఖలు మారుతున్నాయని గ్రామస్తులు తెలిపారు గ్రామ అభివృద్ధికి కృషి చేస్తున్న రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ సహకారం వల్లే ఈ పనులు సాధ్యమయ్యాయని గ్రామస్తులు పేర్కొంటున్నారు ఈ నేపథ్యంలో మంత్రి సోదరులు శివప్రసాద్ గ్రామవాసులు పూల బొకేతో సత్కరించి అభినందించారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి వడ్డీ సునీత లక్ష్మిశీజి తెలియజేసిన పార్టీ నాయకులు కార్యకర్తలు గ్రామ పెద్దలు యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# ఏఐటీయూసీ 21వ జిల్లా మహాసభల కరపత్రాలు విడుదల

పత్తికొండ /పెన్ పవర్/మార్చి 03
పత్తికొండ:మార్చి28. 29.తేదీలలో ఆలూరులో జరుగు 21వ ఏఐటీయూసీ జిల్లా మహాసభల కరపత్రాలను నేడు పత్తికొండ స్థానిక చదువుల రామయ్యా భవన్ సిపిఐ కార్యాలయంలో విడుదల చేయడం జరిగింది. ఈకార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ కార్యదర్శి ఎన్.క్రిష్ణయ్య ఎఐటియుసి తాలూకా అధ్యక్షులు జి.నెట్టికంఠయ్య ఏఐటీయూసీ తాలూకా కార్యదర్శి హెచ్ రంగన్న ఏఐటీయూసీ తాలూకా డిప్యూటీ కార్యదర్శి జి గుండు బాషా, ఏఐటీయూసీ తాలూకా గౌరవ అధ్యక్షులు,బి మాదన్న, సిపిఐ మండల కార్యదర్శి యు కారుమంచి, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు కాంతమ్మ,హమాలి సంఘం నాయకులు సోము, శివ, సుంకన్న భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు యర్రిస్వామి ఆటో యూనియన్ నాయకులు రమేష్, విజయ్ ,హెమంత్,హరి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నాగరాజు పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ కార్యదర్శి ఎన్ కృష్ణయ్య,తాలూకా ప్రధాన కార్యదర్శి హెచ్. రంగన్న మాట్లాడుతూ ఏఐటియుసి 1920 అక్టోబర్ 31న వాణిజ్య రాజధాని బొంబాయి నగరంలో ఆనాటి స్వతంత్ర సమరయోధులు లాలా లజపతిరాయ్,బిఫిన్ చంద్ర పాల్, ఎస్ ఏ డాంగే, జవహర్లాల్ నెహ్రూ స్థాపించిన మొట్టమొదటి భారత దేశ జాతీయ కార్మిక సంఘం ఏ ఐ టి యు సి అని వారు తెలిపారు. భారతదేశానికి స్వతంత్రం రావాలని, శ్రమ దోపిడీ లేని సమ సమాజం రావాలని కార్మిక రాజ్యం రావాల నే లక్ష్యాలతో బ్రిటిష్ సామ్రాజ్యవాద వలస పాలన వ్యతిరేకంగా అనేక పోరాటాలు, త్యాగాలు కార్మికులకు శ్రమకు తగ్గ వేతనం ఇవ్వాలని వారానికి ఒక రోజు విశ్రాంతి దినం ఉండాలని ఎనిమిది గంటల పని విధానం అమలు చేయాలని,బ్రిటిష్ వారి కాలంలోనే అనేక పరిశ్రమంలోని కార్మికుల పక్షాన అనేక ధర్నాలు సమ్మెలు నిర్వహించినటువంటి గొప్ప చరిత్ర కలిగిన సంఘం ఏఐటీయూసీ అని వారు కొనియాడారు. స్వతంత్ర అనంతరం దేశంలోని సంఘటిత, అసంఘటితరంగా కార్మికులకు సంఘాలు ఏర్పాటు చేసి



యూనియన్ ఏర్పాటు చేసుకునే హక్కును,కార్మిక జీతాలు పెంచుకునే బీరసారాల చట్టాన్ని,కార్మిక వివాదాల చట్టాన్ని, పిఎఫ్,ఈఎస్ఐ, పెన్షన్ లాంటి 44 కార్మిక చట్టాల్ని దాంట్లో అగ్రగామి కార్మిక సంఘం ఏ ఐ టి యు సి అని వారు తెలిపారు. నేడు కేంద్రంలో ఉన్నటువంటి బిజెపి ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్నటువంటి తెలుగుదేశం జనసేన కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్నటువంటి కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నిరంతరం కార్మికుల పక్షాన పోరాటాలు చేస్తూ బిజెపి ప్రభుత్వం తీసుకు వచ్చినటువంటి నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని 44 కార్మిక చట్టాలు అమలు చేయాలని కాంట్రాక్టు విధానాన్ని రద్దుచేసి కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం 26 వేల రూపాయలు చెల్లించాలని అసంఘటిత రంగంలో ఉన్నటువంటి ఆటో, హ మాలి, భవన నిర్మాణ,చేనేత వ్యవసాయ కార్మిక కార్మికులకు సంక్షేమ భద్రతా చట్టం తీసుకురావాలని ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో పనిచేస్తున్నటువంటి ఆశ, అంగనవాడి, మధ్యాహ్న భోజనం, స్కూలు లాంటి కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించి, విబిజి రాంజీ గ్రామీణ ఉపాధి పథకాన్ని రద్దు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులకు ఓల్డ్ పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని,పెండింగ్లో ఉన్నటువంటి డి ఏ అరియర్స్ చెల్లించాలని, 12వ పి.ఆర్.సిని అమలు చేయాలని కార్మిక పక్షాన దేశవ్యాప్తంగా ఇతర కార్మిక సంఘాలను కూడగట్టి 26 దేశవ్యాప్త సార్వత్రిక సమ్మేళన నిర్వహించినటువంటి మహా ఉద్యమ చరిత్ర కలిగిన కార్మిక సంఘం ఏ ఐ టి యు సి అని వారు తెలిపారు. ఇంతటి గొప్ప చరిత్ర కలిగినటువంటి కర్నూలు జిల్లా 21వ మహాసభలు మార్చి 28 వ తేదీన ఆలూరులో వేలాది మందితో ప్రదర్శన బహిరంగ సభ నిర్వహించబడుతుందని 29వ తేదీన 200 మంది కార్మిక సంఘాల నాయకులతో ప్రతి జిల్లా సభ జరుగుతుందని ఈ మహాసభలకు ముఖ్య అతిథులుగా భారత కమ్యూనిస్టు పార్టీ ( సిపిఐ )జాతీయ కార్యదర్శి కే రామకృష్ణ గారు, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఆర్ రవీంద్రనాథ్ గారు, పి వెంకటసుబ్బయ్య గారు హాజరవుతున్నారని,ఈ మహాసభలు విజయవంతం చేయడానికి కర్నూలు జిల్లాలోని ఏఐటీయూసీ సంఘాల నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్మికులు, ఉద్యోగులు , పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు

# కన్నుల పండువగా కళ్యాణమల్లేశ్వరుని దివ్య రథోత్సవం

## విచ్చేసిన జన సందోహం-ప్రత్యక్షంగా పరోక్షంగా వేలాదిమంది వీక్షణ





బాపట్ల జిల్లా /పెన్ పవర్/మార్చి 03 మండల కేంద్రమైన భట్టిప్రోలులో వేంచేసియున్న శ్రీ భ్రమరాంబ సమేత శ్రీ మల్లేశ్వర స్వామి వారి దివ్య రథోత్సవంను సోమవారం అత్యంత కన్నుల పండువ గా నిర్వహించారు. ఆదివారం రాత్రి భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి వారి కళ్యాణం అత్యంత ఘనంగా జరిగింది. కళ్యాణోత్సవంలో జొన్నాదుల వెంకట వరప్రసాద్ - పద్మజ దంపతులు పాల్గొన్నారు. ముందుగా ఎదురు కోల నిర్వహించారు. అత్యంత సుందరంగా విద్యుత్ దీపాలతో అలంకరించిన రథంపై కళ్యాణ మల్లేశ్వరుని ప్రతిష్టించారు. అనంతరం రథం ముందు అన్నం ను వారబోసి రథంగా హోమాన్ని జరిపారు. ఈ సందర్భంగా వేమూరు శాసనసభ్యులు నక్కా ఆనందబాబు, తహసిల్దార్ ఎం శ్రీనివాసరావు,గ్రామ సర్పంచ్ దారా రవికిరణ్మయి, దేవస్థానం ట్రస్టీలు కొడాలి రామశాస్త్రి,కొడాలి శంకరరావు,కొడాలి పానకాలరావు,కొడాలి లక్ష్మీ కాంతారావు, దేవాదాయశాఖ మేనేజర్ ఎం శ్రీనివాసరావు లు పాల్గొన్నారు. హోమం పూజను దండిబోట్ల రాజేంద్రప్రసాద్,కౌత సత్య వెంకట నాగరాజేష్ లు జరిపించారు. అనంతరం వేలాదిమంది భక్తులు రథం కు రెండు వైపులా నున్న మోకులను చేత బట్టి హర హర శంభో శంకర, శివ శివ అంటూ రథాన్ని ముందుకు లాగారు. దారి పొడవునా కళ్యాణమల్లేశ్వరునికి భక్తులు, మహిళలు హారతులిచ్చి టెంకాయలు,పూలు, పండ్లు సమర్పించుకున్నారు. స్వామి వారి అత్తవారిల్లుగా పేరొందిన అద్దేపల్లి అమ్మవారి చెట్టు వద్దకు వెళ్ళిన అనంతరం అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించి తిరిగి రథాన్ని కోవెలకు సమీపానికి చేర్చారు. ఈ రథోత్సవాన్ని ప్రత్యక్షంగా పరోక్షంగా వేలాదిమంది భక్తులు తిలకించారు. భట్టిప్రోలు మండలంలోని భక్తులే కాక ఇతర గ్రామాల నుంచి వందలాదిమంది భక్తులు విచ్చేసి స్వామివారి రథోత్సవాన్ని తిలకించారు. ఈ సందర్భంగా భట్టిప్రోలు-అద్దేపల్లి ఆర్యవైశ్య మహిళా సంఘం,భట్టిప్రోలు వాసవి క్లబ్,వాసవి కుబేర వనిత క్లబ్ ల ఆధ్వర్యంలో మజ్జిగ ప్యాకెట్లు,బిస్కెట్ల ప్యాకెట్లు,తాగునీటి ప్యాకెట్లు అందజేశారు. ఈ కార్యక్రమాలను దేవాలయ కార్యనిర్వహణాధికారి ట్రస్టీలు అద్దేపల్లి..భట్టిప్రోలు పద్మశాలియ బహుత్తమ సంఘం నాయకులు,యువకులు పర్యవేక్షించారు. రథోత్సవం సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వేమూరు సిఐ పసుపులేటి వీరాంజనేయులు ఆధ్వర్యంలో భట్టిప్రోలు ఎస్సై ఎం శివయ్య పర్యవేక్షణలో భట్టిప్రోలు, వేమూరు,నగరం, చెరుకుపల్లి,అడవుల దివి,నిజాంపట్నం తదితర పోలీస్ స్టేషన్ ల నుంచి సుమారు 80 మంది సిబ్బంది పాల్గొని పటిష్ట బందోబస్తు నిర్వహించారు. చొప్పదారులైన బట్టు వామనేశ్వరరావు, నందం ప్రసాద్, ఆకురాతి వీరాస్వామి, వెంకటేశ్వరరావులు రథమును చాకచక్యంగా పయ నింప జేశారు.

# రేపల్లెలో ఫైర్ క్రాకర్స్ గోదాములపై డీఎస్పీ శ్రీనివాసరావు ఆకస్మిక తనిఖీలు.

రేపల్లె /పెన్ పవర్/మార్చి 03

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రేపల్లె డివిజన్ డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు శనివారం రేపల్లె, చెరుకుపల్లి, నగరం ప్రాంతాలలోని ఫైర్ క్రాకర్స్ గోదాములను ఆకస్మికంగా తనిఖీ చేశారు. గోదాములలో భద్రతా ప్రమాణాలు, అగ్నిమాపక పరికరాల ఏర్పాటు, అత్యవసర నిష్క్రమణ మార్గాలు, లైసెన్స్ నిబంధనల అమలు వంటి అంశాలను స్వయంగా పరిశీలించారు. ముఖ్యంగా అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు సక్రమంగా పాటిస్తున్నారా లేదా అన్న విషయంపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ సందర్భంగా ప్రజల భద్రత దృష్ట్యా గోదాం యజమానులకు పలు సూచనలు చేశారు. అగ్నిమాపక పరికరాలను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచాలని, గోదాములలో అధికంగా సరుకు నిల్వ చేయకూడదని, భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. నియమాలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. డీఎస్పీ శ్రీనివాసరావు తో పాటు పోలీసు సిబ్బంది ఈ తనిఖీల్లో పాల్గొన్నారు

# అరెస్టులపై ఆర్డీవో కార్యాలయం ముందు అంగన్వాడీల నిరసన.

రేపల్లె /పెన్ పవర్/మార్చి 03

అంగన్వాడీ కార్యకర్తల అరెస్టులను ఖండిస్తూ ఏఐటీయూసీ అనుబంధ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం రేపల్లెలోని ఆర్డీవో కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం అన్యాయంగా అరెస్టులు చేసి కార్మికుల హక్కులను అణగదొక్కుతోందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సింగం వాణిశ్రీ మాట్లాడుతూ, అంగన్వాడీ కార్యకర్తలు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం శాంతియుతంగా పోరాటం చేస్తున్న సమయంలో అరెస్టులకు పాల్పడటం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. వెంటనే అరెస్టయిన వారిని విడుదల చేయాలని, సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్చలకు రావాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో ఏఐటీయూసీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ బాపట్ల జిల్లా సభ్యురాలు సింగం వాణిశ్రీ, ఏఐటీయూసీ నియోజకవర్గ నాయకులు కోన శ్రీను, ఏఐటీయూసీ బాపట్ల జిల్లా కౌన్సిల్ సభ్యులు పడవాటి బిక్షాలు, పర్వీన్ బేగం, రమాదేవి, బుజ్జి, నసీమ సుల్తాన్, నాగలక్ష్మి, సౌందర్య, భువన తదితరులు పాల్గొన్నారు. చివరగా తమ డిమాండ్లను పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు

# వాడరేవుపిడుగురాళ్ల జాతీయ రహదారిపై ఘోర ప్రమాదం

## మహిళతో పాటు ఏడు గేదెల మృతి

బాపట్ల జిల్లా /పెన్ పవర్/మార్చి 03

బాపట్ల జిల్లా: వాడరేవు నుండి పిడుగురాళ్లకు వెళ్లే జాతీయ రహదారి167పై సోమవారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. అశోక్ లేలాండ్ మినీ వ్యాన్ అతివేగంగా వెళ్లి రోడ్డుపై నడుస్తున్న మహిళను మరియు ఆమె వెంట ఉన్న గేదెలను ఢీకొట్టింది.

స్థానికుల సమాచారం మేరకు ప్రమాదానికి ప్రధాన కారణం వాహనం అతివేగమేనని తెలుస్తోంది. ఈ ప్రమాదంలో చీరాల మండలం ఈపురుపాలెం గ్రామం స్థావరం పాలెంకు చెందిన కొమ్మనబోయిన సుబ్బయ్యమ్మ (60) అక్కడికక్కడే మృతి చెందారు. ఆమె తనకు చెందిన గేదెలను పొలంలో మేపుకుని ఇంటికి తీసుకెళ్తుండగా ఈ విషాదం జరిగింది. ప్రమాదంలో మొత్తం ఏడు గేదెలు కూడా మృత్యువాత పడ్డాయి. సంఘటన స్థలానికి చేరుకున్న స్థానికులు, బంధువులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఈ దుర్ఘటనతో ఆ ప్రాంతమంతా దుఃఖంలో మునిగిపోయింది. పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం.

# రసాలయ కళా సమితి ఆధ్వర్యంలో హోలీ పండుగ సందర్భంగా యాచకులకు నూతన వస్త్రాలు అల్పాహారం అందజేత

రేపల్లె /పెన్ పవర్/మార్చి 03

రేపల్లె రసాలయ కళా సమితి ఆధ్వర్యంలో హోలీ పండుగ సందర్భంగా స్థానిక చంద్రమౌళి పార్క్ ప్రక్కనగల అభయ ఆంజనేయస్వామి దేవాలయం వద్ద గల యాచకుల కు నూతన వస్త్రాలు అల్పాహారం అందజేసినట్లు కళా సమితి కార్యదర్శి కోడె గౌరీశంకర్ తెలిపారు కీర్తిశేషులు కోడే అప్పారావు సరోజినీ దేవిల జ్ఞాపకార్థం ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని ఆయన తెలిపారు మానవసేవే మాధవసేవ అని భావించి నూతన వస్త్రాలు పంపిణీ చేయడం జరిగిందని ఆయన తెలిపారు కుల మత భేదాలు మరిచి చిన్న పెద్ద అందరూ కలిసి సంతోషంగా జరుపుకునే పండుగ హోలీ అని ఆయన అన్నారు చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా హోలీ పండుగ జరుపుకుంటారని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో కళా సమితి సభ్యులు మల్లెల రామచంద్రరావు కన్నా నటరాజు వై రామాంజనేయులు సాంబశివరావు శివశంకరరావు పి శాంతారావు ఏ శ్రీనివాసరావు శ్రీను తదితరులు పాల్గొన్నారు

# అక్రమంగా అరెస్టు చేసిన అంగన్వాడీలను విడుదల చేయాలి

## (ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, & సీఐటీయూ)

/పెన్ పవర్/మార్చి 03 :- అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు. ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్తాం అంగన్వాడి వర్కర్స్ సెంటర్ ఫర్ సీనియర్ నాయకులు మహేశ్వరి, రాజేశ్వరి, సునంద, రామేశ్వరి, సిఐటియు డివిజన్ కార్యదర్శి జే, మోహన్ ల. హెచ్చరిక...అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని మార్చి రెండో తేదీన విజయవాడలో మహాధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ ధర్నా కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధంగా అంగన్వాడీలను అరెస్టు చేసి నిర్బంధించిందని వారిని వెంటనే విడుదల చేయాలని గూడూరు బస్టాండులో సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడి కార్మికులు ధర్నా కార్యక్రమం చేపట్టడం జరిగింది, ఈ ధర్నా కార్యక్రమానికి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు శాంతన్న, హమాలి వర్కర్స్ యూనియన్ నాయకులు దానమన్న,లు మద్దతు తెలిపి ధర్నాలో పాల్గొన్నారు,ఈ కార్యక్రమానికి అంగన్వాడి నాయకురాలు సునంద అధ్యక్షత వహించగా సిఐటియు డివిజన్ కార్యదర్శి

జే, మోహన్, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు మహేశ్వరి, రాజేశ్వరి, రామేశ్వరీ లు మాట్లాడుతూ....రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తానని ప్రకటనలకే పరిమితమైందని ఈ సంఘటన ద్వారా తెలుస్తుంది, అంగన్వాడీలకు గత ఐదు సంవత్సరాలుగా జీతాలు పెరగకపోవడంతో అంగన్వాడీల వేతనాలు పెంచాలని గత ప్రభుత్వ కాలంలో 42 రోజుల పాటు సమ్మె చేస్తున్నప్పుడు ప్రస్తుతమున్న ముఖ్యమంత్రితో సహా మంత్రులు ఎమ్మెల్యేలు సమ్మె శిబిరాలకు వచ్చి తాము అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో అంగన్వాడీల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు అవుతున్న ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని, ఆ హామీలు అమలు చేయమని

విజయవాడలో శాంతియుతంగా ధర్నా చేపట్టినటువంటి అంగన్వాడీలను అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని ఖండించారు. రెండో తారీకు విజయవాడలో ధర్నా చౌక్ దగ్గర వేలాది మంది అంగన్వాడీలను చూసి రాష్ట్ర ప్రభుత్వం బయపడిందని,, అందుకే రాత్రికి రాత్రి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు బేబీ రాణి సుబ్బరావమ్మల తో పాటు అనేకమంది అంగన్వాడీలను అక్రమంగా అరెస్టు చేయడంతో పాటు వారిని ఎక్కడ నిర్బంధించారో తెలియకుండా బస్సుల్లో తిప్పడం ఎంతవరకు సమంజసం అని వెంటనే వారిని విడుదల చేయాలని లేని పక్షంలో ఈ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ప్రభుత్వానికి వారు హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు విజయ కుమారి, తరుని, సలోని, విజయలక్ష్మి, ప్రశాంతి, లింగేశ్వరి, మున్సిపల్ కార్మికులు రత్నం, రవి, రాజు తదితరులు పాల్గొన్నారు




01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# ఇరాన్.పైఅమెరికా,ఇజ్రాయిల్ దాడులు దుర్మార్గం

## సిపిఐ.పట్టణ కార్యదర్శి జి రంగయ్య సీనియర్ నాయకులు భాస్కర్ యాదవ్

ఎమ్మిగనూరు /పెన్ పవర్/మార్చి 03

ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయిల్ సంయుక్తంగా చేస్తున్న దాడులను తక్షణమే ఆపాలని కోరుతూ ఎమ్మిగనూరులోసిపిఐ,ఇన్సాఫ్ సమితుల ఆధ్వర్యంలో ఈ మేరకు మంగళవారం సాయంత్రం సోమప్ప సర్కిల్ లో ప్రపంచం శాంతిని కాంక్షిస్తూ. యుద్ధంలో కన్నుమూసిన పౌరులకు కొవ్వొత్తుల తో నివాళి అర్పించడం జరిగిందని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐపట్టణ కార్యదర్శి జి రంగన్న, సిపిఐ సీనియర్ నాయకులు భాస్కర్ యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమెరికా అనుసరించే సామ్రాజ్యవాద, దురాక్రమణ పూరిత చర్యల వల్లే ప్రపంచ శాంతికి విఘాతం కలుగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం చమురు నిక్షేపాల కోసమే కుంటి సాకులతో ఇరాన్.పైఅమెరికా,ఇజ్రాయిల్ సంయుక్తంగా, ఏకపక్షంగా దాడులకు తెగబడ్డాయని పేర్కొన్నారు. ఈ దాడిలో అమాయక పౌరుల ప్రాణాలు కోల్పోవడం జరుగుతుందని వారు తెలిపారు. నిత్యం ప్రపంచ దేశాల మధ్య యుద్ధాలను సృష్టిస్తూ ప్రపంచ అశాంతికి అమెరికా,ఇజ్రాయిల్ దేశాలే కారణమవుతున్నాయని పార్ తెలిపారు. లక్షలాది మంది ప్రాణాలను యుద్ధాల పేరుతోబలితీసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవలే వెనిజులా అధ్యక్షుడు మధురో, ఆయన భార్యను అమెరికా కిడ్నాప్ చేశారని వారు గుర్తు చేశారు. ఇప్పుడు ఇరాన్ పై దాడికి తెగబడిందని తెలిపారు. ఎన్నో యుద్ధాలు ఆపానని... తనకే నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలని కోరిన ట్రంప్ ఇలాంటి ఉన్మాద యుద్ధాలకు దిగడం సిగ్గు చేటని పేర్కొన్నారు. ప్రపంచ శాంతిని కోరుకునే వారంతా ఈ దాడులను ఖండించాలని కోరారు. ప్రపంచం శాంతి కోసం దళమెత్తామని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి రాజీవ్, సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి సమీవుల్లా, సిపిఐ నాయకులు దాదావలి, బజారి, తిమ్మా గురుడు, మల్లికార్జున గౌడ్, నరసింహారెడ్డి,విజయేంద్ర, కుమార్,మల్లి ,ఇన్సాఫ్ నాయకులు నాయకులు మహ్మద్ హుస్సేన్, సాబీర్, రఫీక్, హుస్సేన్, మైబూబ్, నూరు,సాబీర్,భాష, తదితరులు పాల్గొన్నారు.



# గ్రామపంచాయితీలకు ఎల్ఆర్ఎస్, బీపీఎస్ ఆదాయాలు

**విజయవాడ, మార్చి 3, పెన్ పవర్:**
గ్రామ పంచాయితీల ఆర్థిక ఇబ్బందులను దూరం చేసేలా ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఎల్ఆర్ఎస్ , బీపీఎస్ పథకాల ద్వారా వచ్చే ఆదాయంలో గ్రామ పంచాయితీలకు వాటా ఇవ్వాలని నిర్ణయించింది. గ్రామ పంచాయితీలకు 50 శాతం,, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలకు 30 శాతం, ఏపీ టౌన్ ప్లానింగ్ విభాగానికి 20 శాతం నిధులు చొప్పున కేటాయించాలని నిర్ణయించింది. ఈ కొత్త విధానంతో గ్రామ పంచాయితీలకు నిధుల కొరత తగ్గుతుందని అధికారులు చెప్తున్నారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గ్రామ పంచాయితీలకు మంచి రోజులు రానున్నాయి. లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకం బిల్డింగ్ పీనలైజేషన్ స్కీమ్ ద్వారా వచ్చే ఆదాయాన్ని గ్రామ పంచాయితీలతో పంచుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. గ్రామ పంచాయితీలకు ఆర్థిక ప్రోత్సాహం అందించేందుకు గానూ ఈ నిర్ణయం తీసుకుంది. కొత్త విధానం కింద గ్రామ పంచాయతీలు తమ పరిధిలో ఎల్ఆర్ఎస్, బీపీఎస్ పథకాల కింద సమీకరించిన ఆదాయంలో సగం వాటాను పొందుతాయి. అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలకు 30 శాతం ఆదాయాన్ని కేటాయిస్తారు. మిగిలిన 20 శాతం రాష్ట్ర పట్టణ ప్రణాళిక విభాగానికి వెళ్తుంది. చాలా వరకూ గ్రామ పంచాయితీలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో.. ఈ విధానం ప్రకారం వాటికి కావాల్సిన నిధులు అందజేయవచ్చని ప్రభుత్వం భావిస్తోంది.స్థానిక సంస్థల సాధికారత విషయంలో ఏపీ ప్రభుత్వం చిత్తశుద్ధిని ఈ నిర్ణయం తెలియజేస్తోందని ఏపీ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్ వెల్లడించారు. ఈ విధానం ప్రకారం క్రమబద్ధీకరణ పథకాల ద్వారా సమీకరించిన నిధులను తిరిగి అదే ప్రాంత అభివృద్ధి కోసం పెట్టుబడి పెట్టనున్నట్లు వివరించారు. గ్రామ పంచాయతీలకు సగం ఆదాయం కేటాయించడం ద్వారా, ప్రభుత్వం గ్రామీణ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం, ప్రాథమిక సౌకర్యాలను మెరుగుపరచడం లక్ష్యంగా పెట్టుకుందని వివరించారు.అంతర్గత రహదారులు, డ్రైనేజీలు, వీధి దీపాల ఏర్పాటు, తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్య నిర్వహణ వంటి కనీస అవసరాలైన పనులకు కూడా నిధులు లేక పంచాయితీలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పరిస్థితి. అనేక గ్రామ పంచాయతీలు సాధారణ పారిశుధ్య పనులను కూడా చేపట్టలేకపోతున్నాయి. ఎక్కువగా ఫైనాన్స్ కమిషన్ గ్రాంట్లపై ఆధారపడతున్నాయి.ఈ నేపథ్యంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఎల్ఆర్ఎస్, బీపీఎస్ ద్వారా ఆదాయాలు స్థిరంగా వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో.. గ్రామ పంచాయతీలు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను చేపట్టేందుకు అవకాశం ఉంటుందని అధికారులు చెప్తున్నారు. సుదీర్ఘ చర్చల అనంతరం ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని ఉన్నతాధికారులు వెల్లడించారు. రెగ్యులరైజేషన్ పథకాల ద్వారా సేకరించిన నిధులను స్థానికంగానే ఖర్చు చేయనున్న నేపథ్యంలో ఎక్కువ మంది తమ ఆస్తుల రెగ్యులరైజేషన్ కోసం ముందుకు వచ్చే అవకాశం ఉందంటున్నారు. ఈ నిర్ణయం ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## బెజవాడలో కొత్త ఎలివేటెడ్ ఫ్లై ఓవర్

**విజయవాడ, మార్చి 3, పెన్ పవర్:** విజయవాడ నగరంలో ట్రాఫిక్ కష్టాలకు చెక్ పడనుంది. ఈ మేరకు కొత్త ఎలివేటెడ్ ఫ్లై ఓవర్ నిర్మించేందుకు ఏపీ ప్రభుత్వం రెడీ అయింది. హైదరాబాద్–మచిలీపట్నం జాతీయ రహదారిలో విజయవాడ నగర పరిధిలో ఉన్నంత మేరకు.. ఆ మార్గంలో ఎలివేటెడ్ ఫ్లై ఓవర్ నిర్మించే ప్రతిపాదనను సర్కార్ పరిశీలిస్తోంది. పండిట్ నెహ్రూ బస్టాండ్ సమీపంలోని రాజీవ్ పార్క్ వద్ద కనకదుర్గ ఫ్లైఓవర్ నుంచి మట్నదలుకొని మచిలీపట్నం వైపు వెళ్లే మార్గంలోని గంగూరు కూడలి వరకు మట్నత్తంగా 14 కి.మీ. మేర ఈ పైవంతెన నిర్మించాలని భావిస్తున్నారు. ఆరు వరుసలతో నిర్మించే ఫ్లై ఓవర్ కారణంగా హైవేలో ప్రయాణించే వారికి ఏ ఆటంకాలూ ఉండవని, విజయవాడ నగర ట్రాఫిక్ కష్టాలకు చెక్ పడుతుందని అధికారులు యోచిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌ను ఎలా చేపట్టవచ్చన్న భిన్న ప్రణాళికలపై ఢిల్లీ స్థాయిలో ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు చర్చిస్తున్నారు.హైదరాబాద్– విజయవాడ– మచిలీపట్నం హైవే–65పై విజయవాడ పరిధిలో ఇబ్రహీంపట్నం, గొల్లపూడి, భవానీపురం, కనకదుర్గ ఫ్లైఓవర్, కృష్ణలంక, వారధి జంక్షన్, బెంజ్ సర్కిల్, ఆటోనగర్ గేట్, కానూరు, పోరంకి, పెనమలూరు మీదుగా ఈ ఫ్లై ఓవర్ నిర్మించనున్నారు. ప్రస్తుతం హైదరాబాద్–విజయవాడ మధ్య ఎన్‌హెచ్–65ను నాలుగు నుంచి ఆరు వరుసలుగా విస్తరించేందుకు ప్రాజెక్ట్ చేపట్టారు. దీన్ని గొల్లపూడి వద్ద విజయవాడ బైపాస్ క్రాస్ అయ్యే పాయింట్ వరకే విస్తరించాలని ముందుగా భావించారు. ఆ తర్వాతా రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు భవానీపురం వద్ద కనకదుర్గ ఫ్లైఓవర్ దాకా విస్తరించేందుకు ఎన్‌హెచ్‌ఏఐ ఒప్పుకుంది. ఈ మేరకు డీపీఆర్ సిద్ధం చేస్తున్నారు. విజయవాడ–మచిలీపట్నం హైవేను ఆరు వరుసలుగా విస్తరించే ప్రాజెక్ట్ కూడా చేపడుతున్నారు. విజయవాడ నగర పరిధిలో కనకదుర్గ ఫ్లైఓవర్ తర్వాతి నుంచి కృష్ణలంక, వారధి జంక్షన్, స్క్రూబ్రిడ్జి, బెంజ్ సర్కిల్, కానూరు, పోరంకి, పెనమలూరు, గంగూరు, కంకిపాడు మీదుగా దావులూరు టోల్‌ప్లాజా వరకు నాలుగు వరుసలుగానే ఈ రహదారి మిగిలిపోనుంది. వాహన రద్దీ ఎక్కువగా ఉండే విజయవాడ నగరం మధ్యలో నాలుగు వరుసలుగా మిగిలిపోతే ఎలాగన్న ప్రశ్న తలెత్తింది. దీనికి విజయవాడలో ఆరు వరుసలతో ఎలివేటెడ్ ఫ్లై ఓవర్ నిర్మించడమే పరిష్కారమన్న అంచనాకు అధికారులు వచ్చారు. తద్వారా కనకదుర్గ ఫ్లైఓవర్ నుంచి గంగూరు కూడలి వరకు ఆరు వరుసలతో ఎలివేటెడ్ కారిడార్ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు.

## కూటమిలో మిత్రుల మధ్యే పోటీ

**ఏలూరు, మార్చి 3, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగకముందే రాజకీయ వాతావరణం వేడెక్కింది. అయితే ఈసారి పోరు అధికార, ప్రతిపక్షాల మధ్య కంటే.. అధికార కూటమిలోని పార్టీల మధ్యే ఎక్కువగా ఉండేలా కనిపిస్తోంది. గత ఎన్నికల్లో ఘోర పరాజయం పాలైన వైసీపీ, ఈ ఎన్నికలను బహిష్కరించే యోచనలో ఉందన్న వార్తలు వినిపిస్తుండటంతో, ఇప్పుడు అందరి దృష్టి టీడీపీ–జనసేన–బీజేపీ పొత్తుపైనే పడింది. పైన నేతలు చేతులు కలిపినా, కింద కేడర్ మనసులు కలవడమే ఇప్పుడు అసలైన సవాల్‌గా మారింది.కూటమిలో భాగస్వామిగా ఉన్న జనసేన పార్టీ, ఈ సారి స్థానిక సంస్థల్లో సింహభాగం ఆశిస్తోంది. ఇటీవల రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ వంటి నేతలు కోనసీమ లాంటి ప్రాంతాల్లో 80 శాతం స్థానాల్లో తామే పోటీ చేస్తామని బహిరంగంగా ప్రకటించడం కూటమిలో కలకలం రేపుతోంది. జనసేన బలంగా ఉన్న ఉమ్మడి గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ఆ పార్టీ కేడర్ సర్పంచ్, ఎంపీటీసీ స్థానాలను వదులుకోవడానికి సిద్ధంగా లేదు. ఇదే పరిస్థితి కొనసాగితే మిత్రపక్షాల మధ్య ఫ్రెండ్లీ కాంటెస్ట్ పేరుతో అంతర్గత పోరు తప్పదని విశ్లేషకులు భావిస్తున్నారుదశాబ్దాలుగా గ్రామస్థాయిలో బలమైన వ్యవస్థ ఉన్న తెలుగుదేశం పార్టీకి, స్థానిక ఎన్నికలు చావో రేవో లాంటివి. తమ గ్రామంలో పట్టు కోల్పోవడానికి ఏ నాయకుడూ ఇష్టపడడు. సీట్ల సర్దుబాటులో భాగంగా తమకు పట్టున్న గ్రామాలను మిత్రపక్షాలకు కేటాయిస్తే, టీడీపీ కేడర్ తిరుగుబాటు చేసే ప్రమాదం ఉంది. ఇప్పటికే పలు నియోజకవర్గాల్లో టీడీపీ, జనసేన ద్వితీయ శ్రేణి నాయకుల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. పైస్థాయిలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ మధ్య ఉన్న సఖ్యత క్షేత్రస్థాయిలో ఓటర్ల బదిలీకి ఎంతవరకు ఉపయోగపడుతుందనేది అసలు ప్రశ్న.జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైసీపీ, ప్రస్తుత పరిస్థితుల్లో ఎన్నికలకు వెళ్లడం కంటే బహిష్కరణ అస్త్రాన్ని ప్రయోగించడం ద్వారా ప్రభుత్వానికి వ్యతిరేకతను ప్రదర్శించాలని భావిస్తోంది. ఒకవేళ వైసీపీ బరిలో లేకపోతే, కూటమిలోని పార్టీలు ఒకరితో ఒకరు పోటీ పడటం ఖాయం. ప్రత్యర్థి లేని పోరాటంలో మిత్రపక్షాల మధ్య వైషమ్యాలు పెరిగి, అది ప్రభుత్వంపై ప్రభావం చూపే అవకాశం ఉందని భావిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కేవలం ఎమ్మెల్యేల స్థాయిలో కాకుండా, గ్రామ స్థాయిలో కమిటీలు వేసి సీట్ల సర్దుబాటు చేయాల్సి ఉంటుంది. గతంలో ఎక్కడ ఎవరు బలంగా ఉన్నారో వారికే కేటాయించడం. నియోజకవర్గ స్థాయిలోనే మూడు పార్టీల నేతలతో కమిటీలు వేసి వివాదాలు పరిష్కరించడం. స్థానిక సమస్యలపై కూటమి తరపున ఒకే అజెండాతో ప్రజల్లోకి వెళ్లడం వంటివి చేయాల్సి ఉంది. కూటమి నాయకత్వం ఈ చిక్కుముళ్లను విడదీయకపోతే, స్థానిక ఎన్నికలు మిత్రపక్షాల మధ్య విద్వేషాలకు దారితీసే ప్రమాదం ఉంది. అధికారాన్ని పంచుకోవడంలో చూపిన పరిణతిని, క్షేత్రస్థాయిలో సీట్ల పంపకంలో కూడా చూపిస్తేనే కూటమి ప్రయోగం విజయవంతమవుతుంది. లేనిపక్షంలో, ప్రత్యర్థి లేకపోయినా సొంత పార్టీల కుమ్ములాటలే కూటమికి అతిపెద్ద శత్రువులుగా మారతాయి.

## ఏపీ పేరు మార్పు రచ్చ...

**కాకినాడ, మార్చి 3, పెన్ పవర్:** ఇటీవల కేంద్ర ప్రభుత్వం కేరళ రాష్ట్రం పేరును మార్చిన సంగతి తెలిసిందే. అక్కడి ప్రజల కోరిక మేరకు కేరళం అని పేరు మార్చారు. దీంతో ఆంధ్ర ప్రదేశ్ పేరును కూడా మార్చాలని డిమాండ్ మొదలైంది. గతంలో ఆంధ్ర రాష్ట్రం ఆంధ్ర ప్రదేశ్ గా అవతరించింది. తరువాత తెలుగు నాడుగా మార్చాలన్న డిమాండ్ తెరపైకి వచ్చింది. అయితే ఇప్పుడు కేరళ పేరు మార్పుతో తెలుగు నాడుగా ఏపీని మార్చాలన్న వాదన వినిపిస్తోంది. అయితే ఎట్టి పరిస్థితుల్లో ఆంధ్రప్రదేశ్ పేరు మార్పును ఊరుకోమని మరో వర్గం హెచ్చరిస్తోంది. అయితే తాజాగా ఈ తేనె తుట్టను కదిపారు ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు. గతంలో ఎన్టీ రామారావు ఉమ్మడి ఏపీ ని తెలుగు నాడుగా మార్చిన విషయాన్ని ప్రస్తావిస్తూ చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి.ప్రముఖ ప్రవచన కర్తగా ఉన్నారు గరికపాటి నరసింహారావు ఆధ్యాత్మికతతో పాటు చరిత్రను గుర్తుచేస్తూ ప్రవచనాలు చెబుతుంటారు. ఈ నేపథ్యంలో గతంలో ఏపీని తెలుగు నాడుగా మార్చేందుకు ఎన్టీఆర్ చేసిన ప్రయత్నాన్ని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్ అనేది తెలుగు పదం కాదని.. ఆంధ్రప్రదేశ్ పేరులో తెలుగుదనం లేదు అని తేల్చేశారు. కేరళ వారికి ఉన్న పట్టుదల కూడా మనకు లేదని.. కేరళ ను కేరళంగా మార్చినట్టే.. ఆంధ్రప్రదేశ్ పేరును తెలుగు నాడుగా మార్చాలని గరికపాటి కోరారు. దీంతో ఆంధ్ర ప్రదేశ్ పేరు మార్పు పై చర్చ మొదలైంది.
ఇదే అంశంపై భువనేశ్వరి పీఠాధిపతి స్వామి కమలానంద భారతి స్పందించారు. ఈ కొత్త చర్చ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ అంటే తెలుగు కాదా? రామాయణ కాలం నుంచి ఆంధ్రా అనే పదం ఉందంటూ ఆయన గరికపాటికి కౌంటర్ ఇచ్చారు. అడిగేవాళ్లు లేరని అధిక ప్రసంగాలు చేస్తున్నారంటూ మండిపడ్డారు. అంతటితో ఆగకుండా వింత పోకడలు, ఇంత ఆలోచనలు మంచిది కాదని.. తెలుగు నాడు అని మార్చినా ఎటువంటి సెంటిమెంటు ఉండదని.. ఇలాంటి మేధావులే ఏపీకి మద్రాస్ రాకుండా చేశారని విమర్శించారు. గరికపాటి తెలంగాణలో స్థిరపడ్డారని.. మా బ్రతుకులు ఎలా ఉండాలో మాకు తెలుసు అంటూ చురకలు అంటించారు. ఆంధ్రప్రదేశ్ పేరును తెలుగునాడుగా మార్చాలనే ఆలోచన ఇప్పటిది కాదు. దీనికి దశాబ్దాల చరిత్ర ఉంది. 1982లో తెలుగుదేశం పార్టీని స్థాపించినప్పుడు ఎన్టీఆర్ తెలుగువారి ఆత్మగౌరవం అనే నినాదాన్ని ఎత్తుకున్నారు. ఆయన హయాంలోనే రాష్ట్రాన్ని తెలుగునాడుగా మార్చాలనే బలమైన ప్రతిపాదన వచ్చింది. అసెంబ్లీలో కూడా దీనిపై చర్చలు జరిగాయి. కానీ అప్పట్లో రాజకీయ పరిణామాలు, రాజ్యాంగపరమైన ఇబ్బందుల వల్ల అది కార్యరూపం దాల్చలేదు.ఇప్పుడు వీరి మధ్య జరిగిన వ్యాఖ్యలు కలకలం రేపాయి.

# రేషన్ షాపులోకందిపప్పు, రాగులు లేనట్లే..

**విజయవాడ, మార్చి 3, పెన్ పవర్:**
ఏపీ ప్రభుత్వం ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకూ రేషన్ దుకాణాల ద్వారా రేషన్ సరుకుల పంపిణీ చేపడుతున్న సంగతి తెలిసిందే. మార్చి నెల ప్రారంభం కావటంతో రాష్ట్రవ్యాప్తంగా రేషన్ సరుకుల పంపిణీ మొదలైంది. అయితే విశాఖపట్నం, అల్లూరి జిల్లా రేషన్ కార్డుదారులకు మాత్రం ఈ నెలలో కందిపప్పుతో పాటుగా రాగులు పంపిణీ కూడా జరగడం లేదు. కందిపప్పు పంపిణీ రాష్ట్రవ్యాప్తంగా నిలిచిపోగా.. గత మూడు నెలలుగా పంపిణీ చేసిన రాగులు కూడా విశాఖ, అల్లూరి జిల్లావాసులకు ఈసారికి అందుబాటులో లేకుండా పోయాయి.ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా రేషన్ కార్డుదారులకు రేషన్ సరుకుల పంపిణీ మొదలైంది. మార్చి ఒకటో తేదీ నుంచి నిత్యావసర సరుకులను రేషన్ దుకాణాల ద్వారా అందిస్తున్నారు. లబ్ధిదారులకు బియ్యంతో పాటుగా అరకిలో పంచదార, కిలో గోధుమపిండి కూడా అందించనున్నారు. కొన్ని చోట్ల జొన్నలు, రాగుల పంపిణీ కూడా జరుగుతోంది. అయితే విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు జిల్లాల వంటి చోట్ల రాగుల పంపిణీ జరగడం లేదు. గత మూడు నెలలుగా రేషన్ కార్డుదారులకు రాగులను పంపిణీ చేశారు. అయితే మార్చి నెలలో మాత్రం ఇచ్చే పరిస్థితి లేనట్లు తెలిసిందిఅవసరాలకు తగిన మొత్తంలో రాగులు సరఫరా కాలేదని సమాచారం. ముఖ్యంగా ఒడిశా నుంచి రావాల్సిన రాగులు రాలేదని.. దీంతో విశాఖపట్నం, అల్లూరి జిల్లాలలో రాగుల పంపిణీ జరగనట్లు సమాచారం. మరోవైపు ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకూ ఆదివారాలతో సహా రేషన్ షాపులు.. లబ్ధిదారులకు అందుబాటులో ఉండనున్న సంగతి తెలిసిందే. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకూ, అలాగే సాయంత్రం



నాలుగు గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ రేషన్ దుకాణాలు ప్రజలకు అందుబాటులో ఉంటాయి.మరోవైపు ఏపీలో రేషన్ కార్డుదారులకు బియ్యం, పంచదార, గోధుమపిండి, రాగులు, జొన్నలు పంపిణీ చేస్తున్నప్పటికీ.. కందిపప్పు సరఫరా మాత్రం జరగడం లేదు. బహిరంగ మార్కెట్లో కందిపప్పు ధరలు చుక్కలను తాకుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా రాయితీపై కందిపప్పు అందిస్తే మధ్యతరగతి జీవికి కాస్త ఊరటగా ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.అయితే ఏపీలో కందిపప్పు పంపిణీ నిలిచిపోయి సుమారుగా ఏడాది కావొస్తోంది.బహిరంగ మార్కెట్లో కిలో కందిపప్పు నాణ్యత ఆధారంగా ధర రూ.110 నుంచి రూ.120 వరకూ పలుకుతోంది. రేషన్ దుకాణాల్లో కిలో కందిపప్పు. రూ.67లకే అందించేవారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా కందిపప్పు సరఫరా చేయాలని జనం కోరుతున్నారు. అయితే పరిస్థితి మాత్రం భిన్నంగా ఉంది. టీడీపీ కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన కొత్తల్లో కొన్ని నెలలు పాటు కందిపప్పు సరఫరా చేశారు. ఆ తర్వాత కందిపప్పు పంపిణీ నిలిచిపోయింది.

# త్వరలో లోకేష్ కు పట్టాభిషేకం ఊహాగానాలు



**విజయవాడ, మార్చి 3పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ లో నారా లోకేష్ సీఎం అనే చర్చ అప్పుడప్పుడూ తెరపైకివస్తోంది. ఇటీవలి కాలంలో లోకేష్ కు పట్టాభిషేకం చేస్తారన్న సోషల్ మీడియాలో తరచూ టాపిక్ వైరల్ అవుతోంది. నిజానికి లోకేష్ డిప్యూటీ సీఎం అనే ప్రచారం కొంత కాలం సాగింది. టీడీపీ నేతలు కూడా వరుసగా ప్రకటనలు చేశారు. కానీ ఇలాంటి ప్రకటనలు చేస్తే ఊరుకునేది లేదని హైకమాండ్ హెచ్చరించడంతో అందరూ సైలెంటు అయిపోయారు. కానీ ఇప్పుడు సీఎం చర్చ వస్తోంది. టీడీపీలో చంద్రబాబు తర్వాత లోకేష్ దే నాయకత్వం. చంద్రబాబు ఇప్పటికిప్పుడు వైదొలిగే అవకాశాలు లేవు. ఎందుకంటే చంద్రబాబుకు దీర్ఘకాలిక లక్ష్యాలు ఉన్నాయి. గతంలో లోకేష్‌ను డిప్యూటీ సీఎం చేయాలని తెలుగుదేశం పార్టీ శ్రేణుల నుంచి పెద్ద ఎత్తున డిమాండ్ వినిపించింది. అప్పట్లో కొందరు నేతలు బహిరంగంగానే ప్రకటనలు చేసినప్పటికీ, పార్టీ అధిష్టానం జోక్యం చేసుకుని వారించడంతో ఆ చర్చ సద్దుమణిగింది. అయితే లోకేష్ సీఎం అనే చర్చ మళ్ళీ తెరపైకి రావడం వెనుక కేడర్‌లో ఉన్న ఉత్సాహమే ప్రధాన కారణం. యువగళం పాదయాత్ర ద్వారా తనను తాను నిరూపించుకున్న లోకేష్‌కు తగిన గుర్తింపు దక్కాలనేది అభిమానుల కోరిక. కానీ, పార్టీ క్రమశిక్షణ దృష్ట్యా ఇలాంటి కీలక అంశాలపై అధిష్టానం అత్యంత జాగ్రత్తగా వ్యవహరిస్తోంది.చంద్రబాబు నాయుడు రాజకీయ ప్రస్థానంలో ప్రస్తుతం అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశం అమరావతి నిర్మాణం. రాజధానిని ఒక కొలిక్కి తీసుకురావడమే తన జీవిత ఆశయమని ఆయన పలుమార్లు స్పష్టం చేశారు. ఈ భారీ ప్రాజెక్టు పూర్తి కావాలన్నా, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గాడిలో పడాలన్నా మరో పదేళ్ల సుదీర్ఘ కాలం పడుతుందనేది వాస్తవం. ఇటువంటి క్లిష్ట సమయంలో అనుభవజ్ఞుడైన చంద్రబాబు పగ్గాలు వదిలిపెడతారనేది కేవలం ఊహ మాత్రమే. అమరావతి స్వప్నం సాకారం కాకుండా ఆయన సీఎం పీఠం నుంచి తప్పుకునే అవకాశం లేదని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.చంద్రబాబు కేంద్ర రాజకీయాల్లోకి వెళ్తారని, అక్కడ కీలక పదవి చేపట్టి రాష్ట్రంలో లోకేష్‌కు బాధ్యతలు అప్పగిస్తారనే ప్రచారం సోషల్ మీడియాలో జోరుగా సాగుతోంది. అయితే, చరిత్రను పరిశీలిస్తే చంద్రబాబు ఎప్పుడూ పదవుల కోసం పాకులాడలేదు. కింగ్ మేకర్‌గా తనకున్న లోక్ సభ ఎంపీల బలాన్ని ఎప్పుడూ రాష్ట్ర ప్రయోజనాల కోసమే ఉపయోగించారు తప్ప, తన సొంత పదవుల కోసం వాడలేదు. 1990లలోనే ప్రధాని పదవినే కాదనుకున్న ఆయనకు, ఇప్పుడు కేంద్ర మంత్రి పదవులపై ఆసక్తి ఉంటుందనుకోవడం పొరపాటే అవుతుందని టీడీపీ వర్గాలంటున్నాయి నిజానికి టీడీపీలో చంద్రబాబు తర్వాత వారసుడిగా లోకేష్ నాయకత్వంపై ఎవరికీ సందేహాలు లేవు. కానీ అది ఎప్పుడు జరగాలి? ఎలా జరగాలి? అనేదానికి కాలమే సమాధానం చెబుతుంది. ప్రస్తుతం జరుగుతున్న చర్చలన్నీ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న గాసిప్స్ మాత్రమే. ప్రస్తుత పరిస్థితుల్లో చంద్రబాబు పాలనపైనే రాష్ట్ర భవిష్యత్తు ఆధారపడి ఉంది కాబట్టి, లోకేష్ పట్టాభిషేకం అనే అంశం ప్రస్తుతానికి కార్యరూపం దాల్చడం అసాధ్యమని టీడీపీ వర్గాలు క్లారిటీ ఇస్తున్నాయి.

# ఆర్సీబీ అభిమానులకు అదిరిపోయే శుభవార్త



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2026 సీజన్‌కు సంబంధించి డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) అభిమానులకు శుభవార్త. ఎన్నో ఉత్కంఠభరితమైన మ్యాచ్‌లకు వేదికైన బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో ఆర్సీబీ తిరిగి అడుగుపెట్టనుంది. రాబోయే ఐపీఎల్ సీజన్‌లో మ్యాచ్‌ల నిర్వహణకు కర్ణాటక ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. దీంతో ఆర్సీబీ తన ఐదు హోమ్ మ్యాచ్‌లను సొంతగడ్డపైనే ఆడనుంది.గత ఏడాది ఆర్సీబీ తన తొలి ఐపీఎల్ టైటిల్ గెలిచిన సందర్భంగా జరిగిన సంబరాల్లో తొక్కిసలాట చోటుచేసుకుంది. ఈ ఘటనలో 11 మంది మరణించారు. పెద్ద సంఖ్యలో అభిమానులు గాయపడ్డారు. నిర్వహణ లోపం వల్ల జరిగిన ఈ ఘటనపై ప్రభుత్వం సీరియస్ అయ్యింది. విచారణ చేపట్టిన అధికారులు స్టేడియంలో కార్యకలాపాలను సస్పెండ్ చేశారు. దీంతో ఆర్సీబీ మరో వేదికను వెతుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే, ప్రస్తుతం భద్రతా చర్యలు మెరుగుపరచడం, ప్రభుత్వంతో జరిపిన చర్చలు ఫలించడంతో స్టేడియంలో మ్యాచ్‌ల నిర్వహణకు అనుమతి లభించింది. అయితే, ఆర్సీబీ ఆడాల్సిన మిగిలిన రెండు హోమ్ మ్యాచ్‌లు మాత్రం ముందస్తు ఒప్పందం ప్రకారం రాయ్‌పూర్‌లోని షహీద్ వీర్ నారాయణ్ సింగ్ అంతర్జాతీయ స్టేడియంలో జరుగుతాయి.

ఈ విషయమై ఆర్సీబీ సీఈవో రాజేష్ మీనన్ మాట్లాడుతూ.. కర్ణాటక ప్రభుత్వం, రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్, పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. "చిన్నస్వామి స్టేడియం కేవలం మా హోమ్ గ్రౌండ్ మాత్రమే కాదు, మా జట్టు అస్తిత్వం

ఇక్కడి అభిమానుల కేరింతలు ఆటగాళ్లకు ఎంతో ఉత్సాహాన్ని ఇస్తాయి. మా అభిమానులు సొంతగడ్డపై మ్యాచ్‌లు చూసేందుకు అర్హులు" అని ఆయన పేర్కొన్నారు. టీ20 వరల్డ్ కప్ ముగిసిన తర్వాత ఐపీఎల్ 2026 పూర్తి షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉంది.

# ఐసీసీ సెమీస్ ప్యానెల్‌లో ఇద్దరు భారతీయులు.. భారత్-ఇంగ్లండ్ కీలక పోరుకు అంపైర్లు వీరే!

**టీ20 ప్రపంచకప్ సెమీ ఫైనల్స్‌కు అంపైర్లను ప్రకటించిన ఐసీసీ**

**భారత్-ఇంగ్లండ్ మ్యాచ్‌కు గఫానీ, పాలేకర్ ఆన్‌ఫీల్డ్ అంపైర్లు**

**దక్షిణాఫ్రికా-న్యూజిలాండ్ మ్యాచ్‌కు నితిన్ మెనన్ థర్డ్ అంపైర్**

**మ్యాచ్ రిఫరీగా మరో భారతీయుడు జవగళ్ శ్రీనాథ్‌కు బాధ్యతలు**

**గత సెమీస్‌లో భారత్ గెలిచినప్పుడు గఫానీ అంపైరింగ్**



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచకప్ కీలక దశకు చేరుకుంది. రేపు, ఎల్లుండి జరగనున్న సెమీ ఫైనల్ మ్యాచ్‌ల కోసం అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) అఫీషియల్స్ జాబితాను విడుదల చేసింది. ఈ ఎలైట్ ప్యానెల్‌లో భారత అంపైర్ నితిన్ మెనన్‌తో పాటు మాజీ క్రికెటర్ జవగళ్ శ్రీనాథ్‌కు చోటు దక్కింది.ఈ నెల 5న ముంబైలోని వాంఖడే స్టేడియంలో డిఫెండింగ్ ఛాంపియన్ భారత్, ఇంగ్లండ్ మధ్య జరగనున్న రెండో సెమీ ఫైనల్ మ్యాచ్‌కు క్రిస్ గఫానీ, అల్లావుద్దీన్ పాలేకర్ ఆన్‌ఫీల్డ్ అంపైర్లుగా వ్యవహరించనున్నారు. ఏడ్రియన్ హోల్డ్‌స్టాక్ థర్డ్ అంపైర్‌గా, పాల్ రీఫిల్ ఫోర్త్ అంపైర్‌గా, ఆండీ పైక్రాఫ్ట్ మ్యాచ్ రిఫరీగా బాధ్యతలు నిర్వర్తిస్తారు. 2024లో ఇదే జట్ల మధ్య జరిగిన సెమీస్‌కు గఫానీ అంపైర్‌గా ఉన్నారు. ఆ మ్యాచ్‌లో భారత్ 68 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ టోర్నీలోనూ గఫానీ భారత్ ఆడిన రెండు మ్యాచ్‌లకు, పాలేకర్ ఒక మ్యాచ్‌కు అంపైరింగ్ చేశారు.

ఇక, రేపు కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్ మధ్య తొలి సెమీ ఫైనల్ జరగనుంది. ఈ మ్యాచ్‌కు రిచర్డ్ ఇల్లింగ్‌వర్త్, అలెక్స్ వార్ఫ్ ఆన్‌ఫీల్డ్ అంపైర్లుగా ఉంటారు. ఈ మ్యాచ్‌లో భారత అంపైర్ నితిన్ మెనన్ థర్డ్ అంపైర్‌గా కీలక బాధ్యతలు చేపట్టనున్నారు. రాడ్ టక్కర్ ఫోర్త్ అంపైర్‌గా, మరో భారతీయుడైన జవగళ్ శ్రీనాథ్ మ్యాచ్ రిఫరీగా వ్యవహరించనున్నారు.రెండేళ్ల క్రితం దక్షిణాఫ్రికా సెమీ ఫైనల్‌లో గెలిచిన మ్యాచ్‌కు ఇల్లింగ్‌వర్త్ అంపైర్‌గా వ్యవహరించగా, ఈ టోర్నీ గ్రూప్ స్టేజ్‌లో న్యూజిలాండ్ ఆడిన మ్యాచ్‌కు వార్ఫ్ అంపైరింగ్ చేశారు. దీంతో అత్యంత కీలకమైన సెమీస్ పోరులకు అనుభవజ్ఞులైన అఫీషియల్స్‌నే ఐసీసీ నియమించినట్లయింది.

# ఇండియా చేరుకున్న పీవీ సింధు.. ఆల్ ఇంగ్లాండ్ ఛాంపియన్ షిప్ కు దూరం..



**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా, ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య యుద్ధం కారణంగా దుబాయ్ ఎయిర్పోర్టులో చిక్కుకున్న ఇండియన్ స్టార్ బ్యాట్మింటన్ ప్లేయర్ పీవీ సింధు స్వదేశానికి చేరుకున్నారు. యుద్ధం కారణంగా దుబాయ్ ఎయిర్పోర్టు మూసివేయడంతో శనివారం నుంచి దుబాయ్ లోనే ఉండిపోయారు సింధు మంగళవారం ( మార్చి 3 ) ఉదయం దుబాయ్ నుంచి బెంగుళూరుకు చేరుకున్నారు. ఆల్ ఇంగ్లాండ్ ఛాంపియన్ షిప్ కోసం బర్మింగ్ హామ్ బయలుదేరిన సింధు యుద్ధం కారణంగా స్వదేశానికి తిరిగి వచ్చారు. దీంతో ఆల్ ఇంగ్లాండ్ ఛాంపియన్ షిప్ కు దూరమయ్యింది. ఈ క్రమంలో ఇంటికి సురక్షితంగా చేరుకున్నానంటూ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు పీవీ సింధు. ప్రస్తుతానికి రెస్ట్ తీసుకొని ఆ తర్వాత భవిష్యత్ ప్రణాళికపై దృష్టి పెడతానంటూ ట్వీట్ చేశారు పీవీ సింధు. జరిగే ఆల్ ఇంగ్లాండ్ ఛాంపియన్ షిప్ లో సింధు పాల్గొనడం లేదని ప్రకటించింది బ్యాట్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా. ఈ టోర్నీ కోసం మిగతా షట్లర్లు సింగపూర్, ఆఫ్రికా మీదుగా ప్రయాణించి బర్మింగ్ హామ్ కు చేరుకున్నారు. మెన్స్ షట్లర్లు లక్ష్యసేన్, ఆయుష్ షెట్టి ఎలాంటి ప్రయాణ సమస్యలు లేకుండా ఇంగ్లండ్ కు చేరారు.మెగా టోర్నీలో లక్ష్యసేన్, డబుల్స్ స్టార్స్ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టిపై ఇండియా అంచనాలు పెట్టుకుంది. అయితే లక్ష్య సేన్ కు తొలి రౌండ్లోనే వరల్డ్ నంబర్ వన్ షి యుకీ (చైనా) రూపంలో కఠిన సవాల్ ఎదురవనుంది. ఆయుష్.. అల్వి ఫర్హాన్ (ఇండోనేసియా)తో తలపడనున్నాడు.

# చీరకట్టులో గ్లామర్ డోస్ పెంచేసిన ప్రభాస్ బ్యూటీ!


బాలీవుడ్ సెన్సేషన్, నేషనల్ క్రష్ త్రిప్తి డిమ్రి తన అందచందాలతో మరోసారి ఇంటర్నెట్‌ను ఊపేస్తోంది. తాజాగా తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఇవి పాత జ్ఞాపకాలుగా మారకముందే అప్‌లోడ్ చేస్తున్నాను అంటూ షేర్ చేసిన చీరకట్టు ఫోటోలు ఇప్పుడు వైరల్‌గా మారాయి. సంప్రదాయబద్ధమైన లుక్‌లో కనిపిస్తూనే, తనదైన స్టైల్‌లో కుర్రాళ్ల హార్ట్ బీట్ పెంచేస్తోంది ఈ భామ. 'యానిమల్' సినిమాతో ఓవర్‌నైట్ స్టార్‌గా మారిన ఈ బ్యూటీ, ఇప్పుడు తన గ్లామర్‌తో సోషల్ మీడియాను షేక్ చేస్తోంది.

**త్రిప్తి సక్సెస్ జర్నీ:**

త్రిప్తి డిమ్రి సినీ ప్రయాణం 2017లో 'పోస్టర్ బాయ్' చిత్రంతో మొదలైంది. ఆ తర్వాత వచ్చిన రొమాంటిక్ డ్రామా 'లైలా మజ్ను'లో తన నటనతో విమర్శకుల ప్రశంసలు అందుకుంది. కేవలం అందానికే పరిమితం కాకుండా, ప్రతిభావంతురాలైన నటిగా గుర్తింపు తెచ్చుకుంది.ఇక 2021లో ఫోర్బ్స్ ఆసియా '30 అండర్ 30' జాబితాలో చోటు సంపాదించుకోవడం ఆమె కెరీర్‌లో ఒక పెద్ద మైలురాయి. ఇక కష్టపడి పైకి వచ్చిన త్రిప్తి, ఇప్పుడు బాలీవుడ్‌లో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్లలో ఒకరిగా నిలిచింది. ఆమె ఎంపిక చేసుకునే కథలు, నటనలోని వైవిధ్యం ఫాన్స్ ను అలరిస్తున్నాయి. సినిమాలతో ఎంత బిజీగా ఉన్నా, సోషల్ మీడియాలో తన అభిమానులను పలకరించడం త్రిప్తి మర్చిపోదు. తాజాగా ఆమె పోస్ట్ చేసిన చీరకట్టు ఫో టోలు ఇప్పుడు టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారాయి. ఫ్యాషన్ డ్రెస్ లో ఎంత బోల్డ్‌గా కనిపిస్తుందో, చీరలో అంతటి హొయలు ఒలికిస్తూ కుందనపు బొమ్మలా మెరిసిపోతోంది. ఇక ఈ ఫోటోలు చూసిన నెటిజన్లు స్టన్నింగ్ బ్యూటీ అంటూ కామెంట్లతో ముంచెత్తుతున్నారు. పాత జ్ఞాపకాలుగా మారకముందే తన అందాలను ఫ్యాన్స్‌కు షేర్ చేసి, మరోసారి అందరి దృష్టిని తనవైపు తిప్పుకుంది ఈ స్పిరిట్ బ్యూటీ.



అనుక్రీతి వాస్ సోషల్ మీడియాను తగలబెట్టింది



**ప్రభాస్ 'స్పిరిట్'లో త్రిప్తి:**

రెబల్ స్టార్ ప్రభాస్, సంచలన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో వస్తున్న 'స్పిరిట్' సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఈ భారీ ప్రాజెక్ట్‌లో త్రిప్తి డిమ్రి హీరోయిన్‌గా నటిస్తుండటం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. సందీప్ రెడ్డి వంగా సినిమాలంటేనే హీరో-హీరోయిన్ల మధ్య ఘాటు రొమాన్స్, బోల్డ్ సీన్స్ మరియు ఇంటెన్స్ లిప్ కిస్సులు ఉంటాయని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఇక 'యానిమల్'లో తన గ్లామర్‌తో కుర్రాళ్ల గుండెల్లో సెగలు పుట్టించిన త్రిప్తి, ఇప్పుడు ప్రభాస్‌తో కలిసి ఎలాంటి మ్యాజిక్ చేయబోతుందోనని ఫ్యాన్స్ అప్పుడే లెక్కలు వేస్తూ మూవీ కోసం ఎదురుచూస్తున్నారు.

సోనమ్ బజ్వా ఫ్లోరల్ కార్సెట్ గౌన్‌లో సొగసును ప్రసరిస్తుంది



Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publications D.No: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Prakasam, Andhra Pradesh - 523001 And Published At Shop No: 9, Bunny Xerox, Rtc Comlex, Kavali, Nellore Dist, Editor Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A2835" e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965